షణ్ముఖ

SHANMUKHAVELUGU

RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

1st Year Happy Work Anniversary.

Good for Health

Best for Readers

THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 4 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 04 జనవరి 2026 పేజీలు 8 : వెల 3/–ఒంగోలు

VOLUME : 03 ISSUE : 4 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 04 January 2026 PAGES : 8 PRICE : 3/-


## తెలుగు భాష వల్ల మనకు ఓ గుర్తింపు జస్టిస్ పి.శ్రీనరసింహ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 03)

మూడో ప్రపంచ తెలుగు మహాసభలు గుంటూరులో అట్టహాసంగా కొనసాగుతున్నాయి. మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ పాల్గొని ప్రసంగించారు. "ఇంత పెద్ద తెలుగు సభ జరుగుతుందని నేను కలలో కూడా ఊహించలేదు. మనిషికి పుట్టుకతోనే మాతృబంధం, భాషాబంధం ఏర్పడతాయి. భాష కేవలం భావవ్యక్తీకరణకు మాత్రమే కాదు. ఒక ప్రపంచాన్ని సృష్టించేంత బలం భాషలో ఉంది. మనందరం భాష వల్ల బంధువులం. తెలుగు భాష వల్ల మనకు ఓ గుర్తింపు ఉంది. అధికార వ్యవహారాల్లో తప్పనిసరిగా తెలుగు ఉండాలి. జిల్లాస్థాయి వరకు కోర్టు –మిగతా 2లో

## తెలుగు కేవలం భాష కాదు.. మన జీవన విధానం: అయ్యన్నపాత్రుడు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 03)

మూడో ప్రపంచ తెలుగు మహాసభలు గుంటూరులో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. తెలుగు కేవలం భాష కాదని.. మన జీవన విధానమని పేర్కొన్నారు."పిల్లల కోసం తల్లులు ఇప్పుడు చందమామ పాటలు పాడట్లేదు. పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చి అన్నం తినిపిస్తున్నారు. తెలుగు విశిష్టతను మన పిల్లలకు చెప్పాలి. పల్లెల్లో కూడా ఇప్పుడు తెలుగు కనుమరుగవుతోంది. సంక్రాంతి, ఉగాది తదితర పండగలకు పునర్వైభవం తీసుకురావాలి. తెలుగు ఖ్యాతిని దేశ, విదేశాలకు విస్తరింపజేసిన ఘనత ఎన్టీఆర్‌ది. ఎన్టీఆర్ ఒకే సినిమాలో మూడు పాత్రలు పోషించి మెప్పించారు. ఇప్పటి సినిమాల్లో గ్రాఫిక్స్ తప్ప ఏమున్నాయి? ఆంగ్లం అవసరమే కానీ.. మాతృభాషను మరవకూడదు. తెలుగు భాష కోసం ఏం చేయాలో సభల్లో చర్చించండి. ఈ సభలో కార్యాచరణ చూపితే.. దాన్ని అసెంబ్లీలో తీర్మానం చేయిస్తాను" అని అయ్యన్న అన్నారు.

## సంఘ విద్రోహ శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతోంది



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జనవరి 03)

సంఘ విద్రోహ, దేశ వ్యతిరేక శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్న ధోరణి ఆందోళన కలిగిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో వైట్ కాలర్ ఉగ్రవాదం అధికమవుతోందని తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో భూపాల్ నోబుల్స్ విశ్వవిద్యాలయం –మిగతా 2లో

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇది ఘనమైన ఆరంభం

పెట్టుబడుల ఆకర్షణలో
దేశంలోనే ఏపీకి అగ్రస్థానం
బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికలో
వెల్లడైన గణాంకాలు
దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో
25.3 శాతం ఏపీకి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 03)

పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 2026 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలానికి (ఏప్రిల్–డిసెంబర్ 2025) దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో ఏపీ ఏకంగా 25.3 శాతం వాటాను దక్కించుకుంది. ఈ విషయాన్ని బ్యాంక్ ఆఫ్ బరోడా తన తాజా ఆర్థిక నివేదికలో వెల్లడించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ డేటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఈ మేరకు ఫోర్బ్స్ బిజినెస్ మేగజైన్ ఓ కథనం వెలువరించింది.దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు శుభవార్త అని, కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వ ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. "ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త, కొత్త సంవత్సరానికి ఘనమైన ఆరంభం. మా ముందుచూపుతో –మిగతా 2లో

## కొండగట్టు నాకు పునర్జన్మ ఇచ్చింది: పవన్ కల్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 03)

ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ.35.19 కోట్ల తితిదే నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు."అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. తితిదే సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది" అని అన్నారు. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓడినప్పుడు ఈవీఎంల తప్పంటున్నవారు.. గెలిచినప్పుడు నోరు మెదపరే

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 03)

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లోని ఎన్నికల ప్రక్రియను వేలెత్తి చూపడం సరికాదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు హితవు పలికారు. ఓడితే ఈవీఎంల తప్పు అంటున్న కొంతమంది అదే ఈవీఎంల ద్వారా గెలిచినప్పుడు మాత్రం తప్పుబట్టడం లేదని వ్యాఖ్యానించారు. శుక్రవారం సింగపూర్‌లో 'శ్రీ సాంస్కృతిక కళాసారథి' సంస్థ నిర్వహించిన ఆత్మీయ –మిగతా 2లో

## పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జనవరి 03)

ఉగ్రవాదం నుంచి తనను తాను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉందని, ఆ హక్కును ఎలా వినియోగించుకోవాలన్నది ఇతరులు నిర్దేశించలేరని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఐఐటీ మద్రాస్‌లో జరిగిన 'టెక్నో–ఎంటర్‌టైన్‌మెంట్ ఫెస్ట్'లో ఆయన మాట్లాడారు. "చాలా ఏళ్ల కిందట భారత్.. పాకిస్థాన్‌తో నదీజలాల ఒప్పందం చేసుకుంది. పాకిస్థాన్ దశాబ్దాల తరబడి ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది. బంగ్లాదేశ్‌తో మన దేశ సంబంధాలు త్వరలో మెరుగవుతాయి. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో ఎప్పుడూ భాగమే" అని స్పష్టం చేశారు.

నాకు సెలవుల్లేవు : తనకు సెలవులు లేకపోయినా జీవితం సమతుల్యంగానే ఉందని జైశంకర్ చెప్పారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే పనిచేస్తానని –మిగతా 2లో

## అమరావతిలో మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జీల నివాస భవనాల నిర్మాణాలపై మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 03)

ఏపీ రాజధాని అమరావతిలో రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జీల కోసం నిర్మిస్తున్న నివాస భవనాల పనులు ఈ ఏప్రిల్‌లో పూర్తి చేసి హ్యాండోవర్ చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలో మొత్తం 4,026 భవనాలు, ఫ్లాట్లు నిర్మాణంలో ఉన్నాయని వెల్లడించారు. వీటిలో 186 బంగ్లాలు, మిగతా 3,840 భవనాలు అపార్ట్‌మెంట్ మోడల్లో రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు.ఈ ఏడాది అమరావతిలో ఎక్కువ వర్షాల కారణంగా కొన్ని పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. అయితే, ప్రస్తుతం అన్ని నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మంత్రుల బంగ్లాలు ఎక్కువ భాగం ఇప్పటికే పూర్తయినట్లు, జడ్జీల బంగ్లాల్లో బ్రిక్ వర్క్, ప్లాస్టింగ్ తుది దశకు చేరిందని, అలాగే అఖిల భారత సర్వీసు అధికారుల టవర్స్ కూడా తుది దశలో ఉన్నాయని తెలిపారు.500 నివాస సముదాయాలను మినహా మిగతా భవనాలను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని నారాయణ చెప్పారు. అన్ని భవనాలు పూర్తయిన తర్వాత, జీఏడీ కి హ్యాండ్ ఓవర్ చేస్తామని, వారు కేటాయింపు ప్రక్రియను చేపడతారని వెల్లడించారు. అలాగే, అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్ కోసం భూసేకరణ –మిగతా 2లో

## సావిత్రిబాయి పూలే జయంతి.. చంద్రబాబు ఘన నివాళి



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జనవరి 03)

మహిళలను విద్యావంతులుగా చేసేందుకు సమాజ కట్టుబాట్లను కాదనే సాహసాన్ని చేసి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరు పొందిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుఘన నివాళి అర్పించారు. ఆనాడు ఆమె చేసిన సాహసం ఈనాడు మహిళలను విద్యావంతులుగా చేయడమే కాకుండా పురుషులకన్నా మిన్నగా అవకాశాలను సద్వినియోగం చేసేలా తీర్చిదిద్దిందని అనడంలో సందేహం లేదన్నారు. సావిత్రిబాయి పూలేకు ఆధునిక మహిళలు సదా కృతజ్ఞతలు తెలపాల్సి ఉందన్నారు.

## జగన్ కష్టాన్ని తన ఖాతాలోకి వేసుకునే ప్రయత్నాన్ని చంద్రబాబు చేస్తున్నారు: గుడివాడ అమర్నాథ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 03)

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించిన ఘనత పూర్తిగా మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ దేనని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసిన నాయకుడు జగన్ అని కొనియాడారు.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ కోసం అవసరమైన భూ సమీకరణ, భూ వివాదాల పరిష్కారం అన్నీ జగన్ హయాంలోనే జరిగాయని అమర్నాథ్ గుర్తుచేశారు. భూములు ఇచ్చిన రైతులు, బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో దాదాపు రూ.1,100 కోట్ల భారీ పరిహారాన్ని జగన్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇది గత ప్రభుత్వాలు చేయలేని పని అని వ్యాఖ్యానించారు.2023 మే 3వ తేదీన భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు జగన్ శంకుస్థాపన చేశారని, 2025 డిసెంబర్ నాటికి తొలి విమానం ల్యాండ్ అయ్యేలా జీఎంఆర్ సంస్థకు స్పష్టమైన టార్గెట్ ఇచ్చారని తెలిపారు. అదే ప్రణాళికలో భాగంగానే ఇప్పుడు తొలి ఫ్లైట్ ల్యాండింగ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.అయితే ఎన్నికల ముందు ఉత్తరాంధ్ర ప్రజలను మభ్యపెట్టేందుకు 2019 ఫిబ్రవరి 14న చంద్రబాబు హడావిడిగా శంకుస్థాపన చేశారని అమర్నాథ్ ఆరోపించారు. మొత్తం 2,700 ఎకరాలు అవసరమైతే, చంద్రబాబు హయాంలో 250 ఎకరాలు కూడా సేకరించలేదని తీవ్ర విమర్శలు చేశారు.జగన్ చేసిన కష్టాన్ని, ఆయన తీసుకున్న నిర్ణయాల ఫలితాన్ని తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారని అమర్నాథ్ మండిపడ్డారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనికి అసలు శిల్పి జగనేనని చెప్పారు.

## ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన యర్రగొండపాలెం నియోజకవర్గ

### ఐటీడీపీ సోషల్ మీడియా నాయకులు షేక్ అజారుద్దీన్





**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జనవరి 3)**
ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన ఉగ్ర నరసింహారెడ్డిని వైపాలెం నియోజకవర్గ ఐటిడిపి సోషల్ మీడియా నాయకులు షేక్ అజారుద్దీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా కృషి చేయాలని ఉగ్ర నరసింహారెడ్డి వారికి సూచించారు. ఉగ్ర ను కలిసిన వారిలో పెద్దారవీడు మండల ఐటీడీపీ అధ్యక్షులు భీమవరం ప్రసన్నమూర్తి, తదితరులు ఉన్నారు.

## 4న లూయిా బ్రెయిలీ జయంతి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)**
లూయిా బ్రెయిలీ జయంతి సందర్భంగా ఈ నెల 4వ తేదీ ఆదివారం ఉదయం 9:30 గంటలకు ఒంగోలులో ప్రకాశం భవనానికి ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలవేసి పుష్పాంజలి ఘటిస్తారని దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాలులో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### 5వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

### జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ పి రాజబాబు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)**



మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 5వ తేదీన సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## డిఆర్ఓకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పోతినేని శ్రీనివాసరావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)**
ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవిన్యూ అధికారి ఛాంబర్ నందు శనివారం సాయంత్రం జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసును మద్దిపాడు మండల టీడీపీ సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్) కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర డైరీని అందజేశారు.

మొదటి పేజీ తరువాయి

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇది ఘనమైన ఆరంభం

కూడిన విధాన సంస్కరణల ప్రభావాన్ని, ప్రత్యేకించి, సకాలంలో మరియు పారదర్శకంగా ప్రోత్సాహకాల పంపిణీ కోసం ఎస్క్రో-ఆధారిత యంత్రాంగాన్ని ప్రవేశపెట్టడం, అలాగే స్పష్టమైన, రంగాల వారీ విధానాలను ప్రవేశపెట్టడం వంటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కార్యక్రమాల ప్రభావాన్ని ఇది ప్రతిబింబిస్తుంది" అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంపై నమ్మకముంచి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన ఇన్వెస్టర్లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ప్రకారం, ఈ తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా మొత్తం రూ.26.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ తర్వాత ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ మూడు రాష్ట్రాలు కలిపి దేశంలోని మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో 51.2 శాతం వాటాను ఆకర్షించడం గమనార్హం.

## తెలుగు భాష వల్ల మనకు ఓ గుర్తింపు: జస్టిస్ పి.శ్రీనరసింహ

కార్యకలాపాలు తెలుగులో జరగాలి. " అని ఆకాంక్షించారు.

**ప్రముఖులంతా మాతృభాషలోనే చదివారు: లక్ష్మీనారాయణ**

"ఐదో తరగతి వరకు మాతృభాషలోనే చదవాలని జాతీయ విద్యా విధానం చెబుతోంది. నాకు తెలుగు బాగా వచ్చు కాబట్టే ఐదు భాషాలు నేర్చుకున్నా. ప్రపంచంలో వివిధ రంగాల ప్రముఖులు వారి మాతృభాషలో చదువుకున్నారు. ఇంగ్లీష్ వల్లే ఉద్యోగాలు రావు. విషయ పరిజ్ఞానం ఉంటే వస్తాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై దృష్టి పెట్టాలి" అని పూర్వ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు.

## అమరావతిలో మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జీల నివాస భవనాల నిర్మాణాలపై మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు

నోటిఫికేషన్ జనవరి 7న జారీ చేస్తామని, ఇంకా 4.5 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని తెలిపారు. ఇందులో 2 ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సుముఖంగా ఉన్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత, రాష్ట్ర మంత్రులు, అధికారులు, జడ్జీలు కోసం ఆధునిక, సౌకర్యవంతమైన నివాస వసతులు అమరావతిలో అందుబాటులోకి వస్తాయి.

## సంఘ విద్రోహ శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతోంది

104వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో శుక్రవారం రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. గతేడాది నవంబరు 10న ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడును ప్రస్తావిస్తూ వైట్ కాలర్ ఉగ్రవాదంపై ఆవేదన వ్యక్తం చేశారు. జ్ఞానంతో పాటు విలువలు, నైతికత ఎంత అవసరమో ఆ ఘటన తెలియజేస్తుందని చెప్పారు. రోగులకు ప్రిస్క్రిప్షన్ రాసే వైద్యుల చేతుల్లో ప్రమాదకర పేలుడు పదార్థాలు ఉండటం దురదృష్టకరమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలోని డిఫెన్స్ స్టార్టప్‌లు అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నాయని చెప్పారు. రాబోయే 15 ఏళ్లలో ఆయుధాల తయారీలో భారత్ పూర్తి స్వయం సమృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**ఆత్మాభిమానం అహంకారంగా మారకూడదు**

ఆత్మాభిమానం చాలా ముఖ్యమని దానిని ఎప్పుడూ అహంకారంగా మారనివ్వరాదని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. "ఆత్మాభిమానం, అహంకారం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. విద్యార్థులు తమ జీవితంలో అహంకారానికి చోటునివ్వకూడదు" అని హితవుపలికారు.

## ఓడినప్పుడు ఈవీఎంల తప్పంటున్నవారు.. గెలిచినప్పుడు నోరు మెదపరే

సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కుటుంబంలో, సమాజంలో, దేశంలో ఐక్యత ఉన్నప్పుడే ప్రపంచం ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో మనం ఐక్యంగా లేకపోవడం వల్లే చిన్నచిన్న దేశాలు కూడా వచ్చి, మనల్ని ఆక్రమించి సంపదను దోచుకెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల వరకే ప్రత్యర్థులు, తర్వాత అందరం భారతీయులం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. భారత ఆర్థిక వ్యవస్థపై అవాంఛిత వ్యాఖ్యలు చేసే వారికి మన అభివృద్ధి ద్వారా ప్రధాని మోదీ తగిన సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.

## పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది

తాను చెప్పలేనని శని, ఆదివారాల్లోనూ ప్రపంచం నడుస్తుంది కదా అని పేర్కొన్నారు. స్విచ్ ఆన్, స్విచ్ ఆఫ్‌లాగా పనిలో విరామం తీసుకోలేనని, విశ్రాంతి కోసం సంగీతం వింటానని, పుస్తకాలు చదువుతానని, సినిమాలు, క్రీడలు చూస్తానని తెలిపారు. మొత్తానికి తన జీవితం సమతుల్యంగా ఉందని చెప్పారు. అయితే ఈ విషయంలో ఇక్కడే కూర్చుని ఉన్న తన సతీమణి విభేదించవచ్చని పేర్కొన్నారు.

## ఇంచార్జి ఆర్ఎంగా జి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరణ బస్టాండ్ అభివృద్ధికి చర్యలు

### ఆర్టీసీ ఇడి నాగేంద్ర ప్రసాద్ వెల్లడి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 3)**



జిల్లా కేంద్రమైన మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆర్టీసీ జోన్ 3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో నూతనంగా రీజినల్ కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. ఇ డి నాగేంద్ర ప్రసాద్ సమక్షంలో నూతన ఇంచార్జి ఆర్ ఎం గా జి సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణాన్ని ద ృష్టిలో ఉంచుకొని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో ప్లాట్ ఫారంల సంఖ్యను పెంచడంతో పాటు, టాయిలెట్స్ ఇతరాత్ర సౌకర్యాలను మెరుగుపరచనున్నామని అన్నారు. ఇందుకోసం టెండర్లను కూడా పిలవడం జరిగిందని, త్వరలోనే పనులు కూడా మొదలు పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో గిద్దలూరు, కనిగిరి, పొదిలి, మార్కాపురం మొత్తం 4 డిపోలు ఉన్నాయని, ఇందులో మొత్తం 320 బస్సులు తిరుగుతున్నాయని తెలిపారు. తమ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. శ్రీశైలం వెళ్ళు ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం మార్కాపురం డిపో నుండి 11 బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని సర్వీసులు తిప్పనున్నట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా 100 శాతం ఆక్యుపెన్సీ పెరిగిందని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జి సత్యనారాయణ, స్థానిక డిపో మేనేజర్ అవ్వారి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాధపురం ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జనవరి 3)**



జగన్నాధపురం ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జగన్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1831 జనవరి మూడో తేదీన మహారాష్ట్రలో జన్మించింది. ఆమె భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని రచయిత్రి. ఆమె నిన్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావు పూలే భార్య కులమత బేధాలుగా అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటిగా బాలికల పాఠశాలను ప్రారంభించింది. కుల వ్యవస్థకు, పిత ృస్వామ్యానికి వ్యతిరేకంగా శూద్రుల,అస్ప ృశ్యల మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమిష్టిగా పోరాటం చేశారు. సమాజంలోని కులతత్వం పురుషాధికత ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులు అందరికీ కూడా ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. భర్తని ఆదర్శంగా తీసుకొని మహిళలకు పురుషులతో సమానంగా విద్యా అవకాశాలు ఉండాలని చాలా కృషి చేశారు. ఈమె కృషి కేవలం మహిళల విద్యకే పరిమితం కాలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు సేవ చేసిన గొప్ప మహిళ. భయంకరమైన ప్లేగుతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు సేవ చేస్తూనే ఆమె మరణించింది. సావిత్రిబాయి పూలే జీవితం సమాజసేవలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేసే ఆదర్శం. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఎం అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

## గొప్ప విద్యావేత్త సావిత్రి బాయిపూలే 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 3)**
కుల వ్యవస్థకు వ్యతిరేకంగా మహిళల విద్య హక్కుల కోసం పోరాడిన గొప్ప విద్యావేత్త సావిత్రిబాయి పూలే అని 139 బిసి కులాల జెఏసి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు తెలిపారు. సావిత్రి బాయి జయంతి సందర్భంగా కరేడులో శనివారం పూలే చిత్రపటానికి పూలమాల అలంకరించారు. సమాజంలోని కుల వివక్షకు గరవుతున్న శూద్రుల విద్యకోసం కోసం తన భర్త, భారత దేశ ప్రథమ సామాజిక వేత్త అయిన జ్యోతిబా పూలే ప్రోత్సాహం తో దేశ చరిత్ర లో ఉపాద్యాయ వ ృత్తి చేపట్టిన మొట్టమొదటి మహిళ సావిత్రి బాయి పూలే. మహారాష్ట్ర లో బిదేవాడ అనే గ్రామంలో 1948లో సొంతంగా స్కూల్ ని ప్రారంభించి ఆడపిల్లలకు చదువుచెప్పడం ప్రారంభించారు. సావిత్రిబాయి భారతదేశంలో మొదటి స్త్రీ వాద ఉద్యమకారిణి. మహిళాసేవా మండళ్ అనే సంస్థను స్థాపించి మహిళల హక్కులను స్త్రీ పురుష సమానత్వం కోసం పాటు పడింది. ఒక ప్రక్క బాల్యవివాహాలను నిషేదానికి, మరో ప్రక్క వితంతు పునర్వివాహాలకు విశేషమైన క ృషి చేశారు. 1973 లో జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక సమాజం ద్వారా కులాంతర వివాహాల జరపించి కులరహిత సమాజం కోసం క ృషిచేశారు. సావిత్రి బాయి పూలే ఆశయాలను నెరవేరడానికి నేటి ప్రభుత్వాలు, ప్రజా సమాజం క ృషిచేయవల్సిన అవసరం ఉందని శ్రీనివాసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దారా శ్రీనివాసులు, సాదం శివకుమార్, చిట్టా శ్రీనివాసులురెడ్డి, మావులూరి బాబు, రేగలగడ్డ వెంకటసుబ్బయ్య, ఆసోది శ్రీనివాసులు, కోణం వెంకారెడ్డి, చేతల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## నూతన మార్కాపురం జిల్లాలో నేడు తొలి ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మర్కాపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి రాజాబాబు

4


షణ్ముఖ వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

ప్రకాశం


# ఉగ్ర సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం

# మంత్రి ఆనం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జనవరి 3)

ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సారథ్యంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం కావాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఒంగోలులో శనివారం పార్టీ అధ్యక్షులుగా ఉగ్ర ప్రమాణస్వీకారం చేసిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల కృషితో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం జరిగిందన్నారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని, ఆయనకు మనమంతా అండగా ఉండాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తూ రైతులకు ఇతోదిక సేవలను మన ప్రభుత్వం అందిస్తుందన్నారు. మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ సంపద సృష్టిస్తూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనలో మోసం తప్ప ఏమీ లేదన్నారు. బ్లూ మీడియా ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. దేశంలో పెట్టే పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబలను ఏపికే తేవడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు నరకాసుర పాలన చూశామన్నారు. 2029లో మళ్ళీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా మనందరం పని చేయాలన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో దర్శి, యర్రగొండపాలెంలో కూడా టిడిపి జెండా ఎగరాలన్నారు. ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు ఉగ్ర ఉగ్రరూపం అందరికి తెలుసని, ఆయన సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం కావడం ఖాయమన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ నూతన కమిటీ మరింత బాధ్యతగా పని చేయాలన్నారు. తీసుకున్న పదవికి మరింత గుర్తింపు తేవాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. ప్రకాశం జిల్లా టిడిపి నాయకులను ఆదర్శంగా తీసుకుని మిగిలిన జిల్లాల నాయకులు పని చేయాలని చంద్రబాబు సూచిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు విషయంలో వైసీపీదంతా మోసమే అన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి కాకుండానే ప్రారంభించి శిలాఫలకం వేయడం సిగ్గు చేటన్నారు. వెలుగొండను పూర్తి చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటే అడగమని ఆయన అన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను కూటమి శ్రేణులు తిప్పికొట్టాలని ఆయన కార్యకర్తలను కోరారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



మాట్లాడుతూ ఉగ్ర నాయకత్వంలో టిడిపి మరింత పటిష్టం కావడం ఖాయమన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్ర ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని చూస్తే మన జిల్లాలో ముందే సంక్రాంతి పండుగ వచ్చినట్లుగా ఉందన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ చెప్పిన హామీలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపడం ఆనందదాయకమని, చంద్రబాబుకు కందుకూరు ప్రజలంతా రుణపడి ఉన్నారన్నారు. (తరువాయి 4లో...)

# కలెక్టరేట్‌లో లిఫ్ట్ ఏర్పాటు

## లిఫ్టును ప్రారంభించిన మంత్రులు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జనవరి 3)

జిల్లా పరిపాలన కార్యాలయమైన కలెక్టరేట్లో లిఫ్ట్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన లిఫ్టును జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి రాజాబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, (తరువాయి 4లో...)

# ప్రాధాన్యత రంగాలపై ప్రత్యేక దృష్టి

## జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జనవరి 3)

విద్య, వైద్యం, తాగునీరు, ఇతర ప్రాధాన్యత రంగాలపై ప్రత్యేక ద ృష్టి సారించి జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఆమె అధ్యక్షతన సౌత్ బైపాస్ రోడ్డులోని జడ్పీ పాత సమావేశ మందిరంలో జరిగింది. వందేమాతర గీతాలాపనతో ప్రారంభమైన ఈ సమావేశంలో విద్యుత్తు, సాంఘిక సంక్షేమ, వ్యవసాయ, నీటిపారుదల, విద్య, వైద్య, గ్రామీణ నీటిపారుదల రంగాలపై చర్చించారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ బి చిన ఓబులేసు, బాపట్ల జిల్లా డిఆర్ఓ గంగాధర్ గౌడ్, జడ్పీ సీఈవో చిరంజీవి, జడ్పిటిసిలు, ఎంపీపీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ జడ్పీ నిధులను సమర్థంగా ఖర్చు చేయడం ద్వారా జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలని అధికారులకు సూచించారు. మార్కాపురం జిల్లాకు వెలుగొండ ప్రాజెక్టు జీవనాడి అని వ్యాఖ్యానించారు. మార్కాపురం జిల్లాగా ఏర్పడినప్పటికీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనేది తన కోరిక అన్నారు. ఈ దిశగా అవసరమైన సహకారం అందిస్తానని ఆయన ప్రకటించారు. కనిగిరి ప్రాంతంలో రూ.4 వేల కోట్ల విలువైన రిలయన్స్ ప్రాజెక్టు పనులను చేపట్టడం ద్వారా అభివ ృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌డిఎస్‌ఎస్ పథకం కింద విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయటంలో సంబంధిత శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమన్నారు. విద్యుత్ స్తంభాలను పాతే విషయంలో ప్రణాళిక లేకపోతే భవిష్యత్తులో రోడ్లను విస్తరించేటప్పుడు స్తంభాల మార్పిడికి ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. తన నియోజకవర్గంలోని సాగు, తాగునీటి సరఫరాపై మరింత ద ృష్టి సారించాలని అధికారులకు ఆయన సూచించారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు ఫలాలు ప్రజలకు అందేలా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలన్నారు. పుల్లలచెరువులోని జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. నెక్కంటి ఇష్టకామేశ్వరి ఆలయం వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రిలో సౌకర్యాలను మెరుగుపరచి అవసరమైన వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని అన్నారు. స్థానిక ఎస్సీ హాస్టల్ లో నీటి కోసం బోర్ ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ రంగాలలోని స్థానిక సమస్యలను జడ్పిటిసిలు, ఎంపీపీలు ఈ సందర్భంగా ప్రస్తావించారు. రెండేళ్లగా తమకు గౌరవ వేతనాలను ప్రభుత్వం ఇవ్వటం లేదని వారు చెప్పారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ద ృష్టికి తీసుకువెళ్లాలని జడ్పీ సీఈవోను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపించామని, మరోసారి లేఖ రాస్తామని చెప్పారు. పెండింగ్లో ఉన్న పాఠశాలల నిర్మాణాలను పూర్తి చేయాలని, ఉపాధ్యాయులను పూర్తిస్థాయిలో నియమించాలని, స్థానిక అవసరాల మేరకు వైద్యులను (తరువాయి 4లో...)

# సీఎం పర్యటన రద్దు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 3)

ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్స్ నిర్మాణ పనుల భూమి పూజ కార్యక్రమానికి విచ్చేయనున్న నేపథ్యంలో శనివారం హెలిప్యాడ్, సభ ఏర్పాటు నిమిత్తం గంటవానిపల్లి, ప్రాజెక్టు టన్నెల్, మార్కాపురంలోని తర్లపాడు రోడ్‌లో ఉన్న సాయి బాలాజీ స్కూల్ ఎదుట ఉన్న ప్రదేశాలను సందర్శించి ముందస్తు ఏర్పాట్లను మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, ఎర్ర గొండపాలెం టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబులతో కలసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ముందుగా అనుకున్న ప్రకారం ఈ నెల 7వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు విచ్చేయునున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమం రద్దయింది. త్వరలోనే తేది ప్రకటిస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట మార్కాపురం ఇంచార్జి సబ్ కలెక్టర్ శివ రామిరెడ్డి, కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# ప్రజలకు పారదర్శక పాలన అందించాలి

కేంద్రమంత్రి పెమ్మసానిని కలిసినఎమ్మెల్యే ఏలూరి

ఎమ్మెల్యేను కలిసిన

మొక్కలు బహుకరించి శుభాకాంక్షలు తెలిపిన

ఆర్డీవోలు, ఎంఆర్ఓ



4

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జనవరి 3)

పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నూతన సంవత్సరం సందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ని కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త సంవత్సరంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర-రాష్ట్ర ప్రభు త్వాలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అదే విధంగా నూతన సం వత్సరం సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాల యంలో బాపట్ల ఆర్డీ వో గ్లోరియా,

## కలెక్టరేట్‌లో లిఫ్ట్ ఏర్పాటు లిఫ్టును ప్రారంభించిన మంత్రులు

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, డిఆర్ఓ బి చిన ఓబులేసు, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపి నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ రూ.27 లక్షలతో ఏర్పాటు చేసిన ఈ లిఫ్ట్ కోసం మాగుంట శ్రీనివాసులురెడ్డి తన ఎంపీ లాడ్స్ నిధుల నుంచి ఆర్థిక సహకారం అందించారన్నారు. అనంతరం ఈ లిఫ్టులో వారు పైకి వెళ్లి కలెక్టరేట్ ఫండ్స్ నుంచి రూ.12.3 లక్షలు వెచ్చించి ఆధునీకరించిన మినీ కాన్ఫరెన్స్ హాలును కూడా ప్రారంభించారు.







## సీఎం పర్యటన రద్దు











# ఉగ్ర సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం

## మంత్రి ఆనం















ఉగ్ర జిల్లా అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేయకముందు మంత్రి డోలా, ఎమ్మెల్యేలతో కలిసి వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుండి కార్యకర్తలు, నాయకులు ర్యాలీకి ఫంక్షన్‌హాలుకు చేరుకున్నారు. సభ ప్రారంభానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేసి, తదుపరి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అధ్యక్షులు ఉగ్ర నరసింహారెడ్డితో పాటు మిగిలిన కమిటీ సభ్యులతో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ప్రమాణస్వీకారం చేయించారు. సభకు డిసిఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి అధ్యక్షత వహించగా టిడిపి ఇన్‌ఛార్జిలు గూడూరి ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఉగ్ర ను మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఏఎంసి చైర్మన్‌లు, పార్టీ నాయకులు, ఘనంగా సత్కరించారు.











## ప్రాధాన్యత రంగాలపై ప్రత్యేక దృష్టి







నియమించాలని సభ్యులు కోరారు. కాగా ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలను, వాటి పురోగతిని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించామని, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు, దెబ్బతిన్న స్తంభాలను మార్చామని ఏపీ సీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు వివరించారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో కల్పించిన సదుపాయాలను, కొత్త భవనాల నిర్మాణంలో పురోగతిని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ తెలియజేశారు. చీమకుర్తిలో ఎస్సీ బాలికల హాస్టల్ నిర్మాణంలో మంచి పురోగతి ఉన్నదని స్థానిక ఎంపీపీ వేమా శ్రీనివాస్ ఈ సందర్భంగా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇరిగేషన్, వ్యవసాయం – దాని అనుబంధ రంగాలు, పంచాయతీ శాఖల ద్వారా చేపట్టిన చర్యలను సభ్యులకు ఆయా శాఖల ఉన్నతాధికారులు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఇప్పటి వరకు ధాన్యం సేకరణ, వాటిని కొనుగోలు చేస్తున్న ఏజెన్సీల వివరాలను జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ వరలక్ష్మి ఈ సందర్భంగా సభ్యులకు తెలియజేశారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న తీరును, ఇతర తరగతుల విద్యార్థులలో అభ్యసన సామర్థ్యం పెంపు కోసం చేపట్టిన చర్యలను డిఈఓ సి వి రేణుక వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల ఉన్నతాధికారులు సమాధానం చెప్పగా, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జడ్పీ చైర్పర్సన్ చెప్పారు. ప్రోటోకాల్ కచ్చితంగా పాటించాలన్నారు. దీని పై ఇంచార్జి జాయింట్ కలెక్టర్ ఓబులేసు మాట్లాడుతూ ప్రోటోకాల్ విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించేలా చూస్తామన్నారు. అనంతరం 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాను రూ.848,82,86,700లుగా జడ్పీ సీఈవో చెప్పారు. 2026 – 27 బడ్జెట్ అంచనా రూ.852,15,36,700లుగా ఆయన ప్రతిపాదించారు. వీటితో పాటు ఇటీవల స్థాయి సంఘాల సమావేశంలో చేసిన ప్రతిపాదనలకు కూడా సభ్యులు ఈ సందర్భంగా ఆమోదం తెలిపారు.

## ప్రజలకు పారదర్శక పాలన అందించాలి



చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, చిన్నగంజాం ఎంఆర్ఓ జె ప్రభాకర్‌రావు, మార్టూరు ఎమ్మార్వో ప్రశాంతిలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూల మొక్కలను బహుకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ 2026 నూతన సంవత్సరంలో స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతూ ప్రజలకు సుపరిపాలన అందించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం పై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమన్వయంతో పని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శక పాలన అందించాలని, అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

## నూతన మార్కాపురం జిల్లాలో నేడు తొలి ప్రజా సమస్యల పరిష్కార వేదిక

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 3)

నూతనంగా ఏర్పాటు కాబడిన మార్కాపురం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఈ నెల 5వ తేదీన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి రాజాబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కాపురం జిల్లా కేంద్రంలోని తర్లుపాడు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మార్కాపురం జిల్లా పరిధిలోని మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజక వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లాకు సంబంధించిన అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాల్లో రెవెన్యూ సిబ్బంది హాజరగుచున్నందున ఈ నెల 5వ తేదీన జరగవలసిన రెవెన్యూ క్లీనిక్ కార్యక్రమం వాయిదా వేయడం జరిగిందని, పిజిఆర్ఎస్ కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి





## అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్
## కొత్త పథకాన్ని రద్దుచేసేంతవరకు ఉద్యమిస్తాం
## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జనవరి 3)**

మహాత్మా గాంధీ పేరుతో 2006 ఫిబ్రవరి 2 వ తేదీన గ్రామీణ పేదలకు, రైతులకు, కర్షకులకు ఉపాధి కల్పన కోసం ఏర్పాటుచేసిన నారేగా పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరుతూ నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అధ్యక్షతన పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పక్షాల నేతలు, కార్మిక ,కర్షక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం గ్రామీణ చిన్న , సన్నకారు రైతులకు, బడుగు బలహీన వర్గాలు వలసల బాట పట్టకుండా వారికి ఉపాధి కల్పించడం కోసం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ యూపీఏ చైర్మన్ శ్రీమతి సోనియా గాంధీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్లోని అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో ప్రారంభించడం జరిగిందని ఆనాటి నుండి ఈనాటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కోట్లాదిమందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని అలాంటి మహోన్నత పథకాన్ని మహాత్మా గాంధీ పేరుని తొలగించి విబిజి రాంజీ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకొని రావడం ఎన్డీఏ కూటమి దివాలా కోరుతారనికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు, కొత్త చట్టాన్ని రద్దు చేసే వరకు అన్ని పక్షాలతో కలిసి ఉద్యమిస్తామని సైదా తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే నాసరయ్య మాట్లాడుతూ పేదల కొట్టే ఇలాంటి నల్ల చట్టాలను అందరూ సమిష్టిగా వ్యతిరేకించాలని ఆయన కోరారు, ఆప్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్ మాట్లాడుతూ బీజేపీ నియంత ృత్వ పాలనలో ప్రతిపక్ష నేతలను అనేకమందికి జైలుకు పంపించిన ఘనత మోడీ అమిత్ షా దేనిని రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ఘాటుగా విమర్శించారు, సిపిఎం నాయకులు బాలనాగయ్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి 12 సంవత్సరాల కాలంలో ఈ దేశాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిందని అదా నీ అంబానీలకు ఈ దేశ సంపదను దోచిపెట్టిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎంపీ జే రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ బిజెపి పాలనలో వర్గ వైశ్యామ్యాలు, విద్వేష రాజకీయాలు చోటుచేసుకున్నాయని మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని ఆయన అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు నూతలపాటి రాజు మాట్లాడుతూ అన్ని రాజకీయ పక్షాలు ఏకమై నిరంకుశ మోడీని గద్దె దించాలని ఆయన అన్నారు.

లోక్సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ మోడీ అమిత్ షా జోడి ఈ దేశానికి పట్టిన రాహు కేతులని ఆయన తీవ్రంగా విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు షేక్ మహబూబ్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే ఈ దేశంలోని అల్ప సంఖ్యాక వర్గాలకు రక్షణ ఏర్పడుతుందని అందరం ఏకమై బిజెపి నల్ల చట్టాలను వ్యతిరేకించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం నాయకులు గాలి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ హయాంలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

### ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయుని మహిళల అక్షరాస్యత కోసం పరితపించిన మహనీయురాలు స్వర్గీయ సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సైదా ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకుల పూలదండలేసి ఘనంగా నివాళులర్పించారు.

### మార్కాపురం జిల్లా సాధన సమితి రథసారథి షేక్ సైదా కి ఘన సన్మానం

మార్కాపురం జిల్లా సాధన కోసం 65 రోజులపాటు మహోన్నత ఉద్యమం నడిపిన మార్కాపురం జిల్లా సాధన సమితి కన్వీనర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ను రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా అఖిలపక్ష నేతలందరూ ఆయన పోరాటపటి మను గుర్తు చేసుకొని అఖిలపక్ష నేతలందరూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, సిపిఎం పట్టణ అధ్యక్షులు ఏడుకొండలు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ ఖాసీం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, సిఐటియు జిల్లా అధ్యక్షులు రూబెన్, కర్లపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, వెలేరే పార్టీ మార్కాపూర్ పట్టణ అధ్యక్షులు షేక్ రసూల్, ఎంపీ జి ఏ పార్టీ నాయకులు షేక్ మీరావాలి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, మార్కాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్లా, ఖాసిం, ఇమ్రాన్, అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన జనసేన ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో తర్లుపాడు మండల గ్రామ పార్టీ కమిటీలు ప్రారంభం



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జనవరి 3)**

జనసేన పార్టీ మార్కాపురం ఇంచార్జి ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో తర్లుపాడు మండలంలోని సూరేపల్లి గ్రామంలో జనసేన గ్రామ పార్టీ కమిటీని ఎన్నుకున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న విధానాన్ని చూసి గ్రామ గ్రామాన జనసేనలో చేరుటకు ప్రజలు, మహిళలు, యువత చాలా ఆసక్తి కనబరుస్తున్నారని జనసేన మండల నాయకులు వెలుగు కాశీరావు తెలియచేశారు. ఈ సందర్భంగా కూటమిలోని అన్ని పార్టీలని కలుపుకొని ప్రజలకు సేవ చేయాలని అలాగే రాబోయే స్థానిక ఎన్నికలకి సిద్ధంగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ నాయకులు గుండెబొమ్ము శ్రీను, వెన్నా రాజారామిరెడ్డి, కొండెబోయిన సునీల్, గంజరపల్లి మహేష్, గుంటూా మోషే, చీకటి శివకాశి, గడ్డం బాలరాజు, పఠాన్ కరిముల్లా, వన్నెబోయిన వెంకటేష్, షేక్ రఫీ పాల్గొన్నారు.

# టీడీపీలో చేరిన 35 ముస్లిం కుటుంబాలు
# ఆత్మీయ ఆహ్వానం పలికిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

## అభివృద్ధికి ఆకర్షితులై ఇంటూరికి మద్దతు
## ఉలవపాడులో బలం పుంజుకున్న తెలుగుదేశం







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 3)**

మండలం ఉలవపాడు గ్రామానికి చెందిన 35 ముస్లిం కుటుంబాల వారు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే గారు పసుపు కండువాలు కప్పి ఆత్మీయంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఉలవపాడు పంచాయతీ 7వ వార్డు సభ్యుడు రఫీ సహా పార్టీలో చేరిన వారంతా మొదటినుంచి వైసీపీకి మద్దతుగా ఉన్నారు. కందుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న నిరంతర అభివ ృద్ధికి ఆకర్షితులై తామంతా టిడిపిలో చేరినట్లు వారంతా తెలియజేశారు. ఇకనుంచి ఇంటూరి నాగేశ్వరరావు వెంటే నడుస్తామని, టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆయా కుటుంబాల్లోని మహిళలంతా కార్యక్రమానికి తరలివచ్చారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా కూటమి ప్రభుత్వంలో పెద్దఎత్తున అభివ ృద్ధి జరుగుతుందని చెప్పారు. కొత్తగా కొత్తగా పార్టీలో చేరిన వారందరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందని తెలియజేశారు. ఉలవపాడు గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు షేక్ రఫీతో పాటు 30 ముస్లిం కుటుంబాలు, ఎద్దు మాల్యాద్రి, జెట్టి కోటిరెడ్డి, వేమిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ బాబు, వెల్డింగ్ ఖాదర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

# ఉలవపాడు జివిఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 3)**

మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ వై. సుధాకర బాబు అధ్యక్షతన ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 195వ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపల్ వై సుధాకర్బాబు సావిత్రిబాయి పూలే బాలికలు, మహిళల విద్యాభివృద్ధి కోసం 1848వ సంవత్సరంలో మొట్టమొదటి బాలిక విద్యాలయాన్ని ప్రారంభించి, వారి అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ మాణిక్యరావు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం, మహిళల విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి





**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జనవరి 3)**

హనుమంతునిపాడు మండలం పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహమ్మదాపురం నందు భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. మొదట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊరే రాధాకృష్ణ, ముఖ్య అతిథి మండల విద్యాశాఖ అధికారి గుర్రం పెద్దిరాజు, పాఠశాల సిబ్బంది జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలేల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రధానోపాధ్యాయులు ఊరే రాధాకృష్ణ సావిత్రిబాయి పూలే మహిళల అభ్యున్నతికి చేసిన కృషిని చక్కగా వివరించారు. మండల విద్యాశాఖ అధికారి గుర్రం పెద్దిరాజు సావిత్రిబాయి పూలే కుల, పితృ స్వామ్య వ్యవస్థల పై ఎలా పోరాటం చేశారో తెలిపి, బడుగు బలహీన వర్గాలకు వారి చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు మహిళా సాధికారత కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషిని తెలియజేశారు. పాఠశాల మహిళా ఉపాధ్యాయ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు పూలే జీవిత చరిత్ర పై ప్రదర్శించిన లఘు నాటిక, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెవెన్యూ క్లీనిక్ కార్యక్రమాలు ప్రతి మండలం, రెవిన్యూ డివిజన్‌లలో నిర్వహిస్తున్నాం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 3)

రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ప్రతి మండలం, రెవిన్యూ డివిజన్‌లలో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలోని రైతులు తమ భూమి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రైతులు తమ సమస్యలపై సంబంధిత తహసిల్దార్, రెవెన్యూ డివిజన్, కలెక్టర్ కార్యాలయాల వద్ద పరిష్కారం పొందవచ్చున్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి మీరు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలన్నింటిని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. తహసిల్దార్ కార్యాలయంలో పొందే సేవలకు ప్రభుత్వం నిర్దేశించిన నామమాత్రపు రుసుము కేవలం రూ.40 నుంచి రూ.100లు చెల్లించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చున్నారు. అలాగే రెవిన్యూ డివిజన్ అధికారి కార్యాలయాల్లో పొందే సేవలపై ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి కేవలం రూ.40 నుంచి రూ.100లు రుసుము చెల్లించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఇదే పద్ధతిలో రెవెన్యూ క్లినిక్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పొందే సేవలపై కలెక్టరేట్ కు వెళ్లి కేవలం రూ.40 నుంచి రూ.100లు నామ మాత్రము రుసుము చెల్లించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి సేవలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు దంపతులు







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జనవరి 3)

ప్రముఖ పుణ్యక్షేత్రం, వలేటివారిపాలెం మండలం మాల కొండలోని శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి సౌజన్య, కుమారులు అవినాష్, సందీప్ స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గోశాలకు వెళ్లి గోవులకు పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదాన సత్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించి, భక్తులకు ప్రసాదం వడ్డించారు. పదార్థాల నాణ్యత గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. అన్నదాన సత్రం పరిశుభ్రంగా ఉండేటట్లు జాగ్రత్త తీసుకోవాలని, భక్తులకు ఇబ్బంది కలగకూడదని అధికారులకు సూచించారు. అమ్మవారి కొండపై నుంచి దిగివచ్చే మెట్లు మార్గంలో అనుమతి లేకుండా తినుబండారాలు అమ్ముతుండడాన్ని ఎమ్మెల్యే గారు గమనించి, వాటిని అక్కడి నుంచి తొలగించాలని ఈవోను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, కందుకూరు పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు కాకుమాని హర్ష, ప్రగడ నరసింహం, పరిటాల భాస్కర్, చుండి అక్కయ్య, తదితరులు ఉన్నారు.

# పులి గణన సరే, జనగణన సంగతేంటి ?



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

## కుక్కల్ని, గాడిదల్ని లెక్కిస్తున్న ప్రభుత్వం
## ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల గణన మాత్రం చెయ్యదు
## కుల గణన చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల పై 50 శాతం సీలింగ్ తొలగించాలి
## దళిత హక్కుల నేత నీలం నాగేంద్రరావు

దేశవ్యాప్తంగా పులుల గణన చేపట్టిన కేంద్ర ప్రభుత్వం 2021లో జరగాల్సిన జనగణనను మాత్రం వాయిదా వేస్తోందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ జన గణన వాయిదాతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలోనే దేశంలో మనుషుల్ని, పశువుల్ని లెక్కించేవారన్నారు. పశువుల్ని జాతుల వారీగా, మనుషుల్ని కులాల వారీగా, మతాల వారీగా లెక్కించేవారన్నారు. చివరగా 1931లో కులణన జరిగిందన్నారు. స్వాతంత్రం వచ్చాక ప్రతి 10 ఏళ్ళకొకసారి మనుషుల జనాభాను, ప్రతి 5 ఏళ్ళకొకసారి పశువుల జనాభాను, ప్రతి నాలుగేళ్లకు ఒకసారి పులుల జనాభాను లెక్కించటాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ కార్యక్రమంగా చేపట్టిందన్నారు. లోగడ పశుగణన లెక్కింపులో ఆవులు, గేదెలను మాత్రమే లెక్కించారని, ఈ దఫా కుక్కలు, గాడిదలు సహా 16 రకాల జాతుల్ని లెక్కించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 2022లో కూడా కేంద్ర ప్రభుత్వం పులుల గణనను లెక్కించిందన్నారు. దేశవ్యాప్తంగా 2022 సర్వేలో 3167 పులులు ఉన్నాయని తేరిందన్నారు. పులుల సర్వే జరిగి నాలుగేళ్లు కావడంతో మరోసారి సర్వే జరిగేందుకు అటవీ శాఖ సిద్ధమైందన్నారు. 2026 సంవత్సరం జనవరి 3 వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు పులుల సంఖ్యను లెక్కిస్తారన్నారు. బీసీ అని చెప్పుకుంటున్న మోడీ పాలనలో మరో 5 నెలలు గడిచాక, దేశంలో ఎన్ని కుక్కలు, ఎన్ని గాడిదలు ఉన్నాయో లెక్క ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ లు ఎంతమందో లెక్క తేల్చే పరిస్థితి లేదన్నారు. 2019 నుండి 2021 మధ్యకాలంలో దేశంలో సంభవించిన కరోనా సోకి రోడ్ల వెంబడి ప్రయాణిస్తూ మరణించిన ప్రజలెంత మందో చెప్పాలని సుప్రీం కోర్టు అడిగితే తన వద్ద లెక్కలు లేవని మోడీ ప్రభుత్వం సమాధానం చెప్పిందన్నారు. మరణించిన వ్యక్తుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వటం ఇష్టం లేని మోడీ ప్రభుత్వం తమ వద్ద లెక్క లేదని చెప్పటం, ప్రజల ప్రాణాల పట్ల లెక్క లేకపోవడమేనని నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని, 50 శాతం సీలింగ్ తొలగించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నా బీసీ మోడీ ప్రభుత్వం స్పందించటం లేదన్నారు. రిజర్వేషన్ శాతాన్ని పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టుల్లో పిటిషన్లు వేసినప్పుడు, రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని చెప్పి, దశాబ్దాల పాటు జనాభా దామాషాలో రిజర్వేషన్లు పెరగకుండా అడ్డుకున్న సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేసిందన్నారు. అగ్రకులాల జనాభా లెక్కలు లేకుండానే, ఈడబ్ల్యూఎస్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్లను సుప్రీంకోర్టు సమర్థించిన విషయాన్ని కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలు గుర్తుంచుకోవాలన్నారు. ఎస్సీ , ఎస్టీలను సమూహాల వారీగా వర్గీకరిస్తే ప్రతి 25 సంవత్సరాలకు ఒకసారి జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో, జనాభా దామాషా ప్రకారం ఎస్సీ ఎస్టీలు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు, శాసనసభ, నియోజకవర్గ స్థానాలు పెరుగుతాయన్నారు. అలాగే దేశ బడ్జెట్లో, ఇంకా రాష్ట్రాల బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జనగణ జరిగితే ఎస్సీ ఎస్టీల ఎంపీ ఎమ్మెల్యే సీట్లు పెరుగుతాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం అధిక మొత్తంలో నిధులు కేటాయించాల్సి వస్తుందని దళిత వ్యతిరేక, మనువాద మోడీ ప్రభుత్వం జనాభాను లెక్కించటం లేదన్నారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి కోరుకున్న 400 స్థానాలు వచ్చినట్లయితే, అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దుచేసి, కులాన్ని బట్టి మనిషికి విలువనిచ్చే మనుధర్మ శాస్త్రాన్ని భారత రాజ్యాంగంగా ప్రవేశపెట్టే వారన్నారు. 400 సీట్లు వస్తాయనే ధీమాతో 2021 జనాభా లెక్కల్ని బిజెపి అడ్డుకుందన్నారు. రాజ్యాంగం మారితే ఎస్సీ ఎస్టీ ప్రయోజనాలను తగ్గించటం మనువాదుల ప్రధాన అజెండా అన్నారు. తాము ఆశించినట్టుగా 400 సీట్లు రాకపోవడంతో, జనగణనను జరిపించాలని ఎస్సీ ఎస్టీలు డిమాండ్ చేయకుండా, వారి దృష్టి మరల్చేందుకు ఎస్సీ ఎస్టీల ఐక్యతను విఛిన్నం చేసేందుకు వర్గీకరణ పేరుతో మోడీ ప్రభుత్వం అగ్గి రాజేసిందని నాగేంద్ర మండిపడ్డారు. ముందు ఎస్సీలను వర్గీకరించారని, అదును చూసుకొని ఎస్టీలను కూడా వర్గీకరిస్తారన్నారు. మనువాద మోడీ ప్రభుత్వం ఎత్తుగడలను ప్రజలు అర్థం చేసుకొని, జనగణన కోసం, కులగణన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని నీలం నాగేంద్రరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, దళిత నాయకులు తానికొండ ఆనంద్, ఎద్దు రామారావు, నారాయణ పాల్గొన్నారు.



# మహిళ విద్యకు మార్గదర్శి సావిత్రిబాయి పూలే

## విద్యాలయ ప్రత్యేక అధికారిని ఏ సునీత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

మహిళల చదువు కోసం, సాధికారత కోసం, స్వేచ్ఛకోసం, సమానత్వం కోసం, సమాన ప్రాతినిధ్యం కోసం మహిళల కళ్ళల్లో ఆనందం, ముఖంలో చిరునవ్వు చూడడం కోసం అలుపెరగని విరామమెరుగని మరియు రాజీలేని పోరాటం చేసిన మహోన్నత త్యాగమూర్తి సావిత్రి బాయి పూలే అని ముండ్లమూరు కస్తూర్బా గాంధీ విద్యాలయ ప్రత్యేక అధికారిని ఆవుల సునీత తెలియజేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో 195వ సావిత్రిబాయి పూలే జయంతి సభను ముండ్లమూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం నందు డిబిఆర్సి ఏరియా కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మహిళలు చదువుకుంటేనే సమాజాభివృద్ధి చెందుతుందని అప్పుడే ఆమె ఆశయాలను నెరవేర్చిన వారము, మహిళలకు చదువు అందించే విషయంలో ఎన్నో సవాళ్లను సంక్లిష్టతలను అడ్డంకులను అవరోధాలను, అవమానాలను బెదిరింపులను ఎదుర్కొని మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ధైర్యసాహసాలను ప్రదర్శించిన యోధురాలు సావిత్రిబాయి పూలే జన్మదినమే భారతదేశ మహిళల విముక్తి దినంగా ప్రకటించుకుని జరుపుకుందామని తెలియజేస్తూదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు వై పద్మజ మాట్లాడుతూ మహనీయురాలు జీవితం అందరికి సూర్తిదాయకంగా ఆదర్శవంతంగా నిలవాలని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యాలయంలో విద్యార్థిలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న 13 మంది ఉపాధ్యాయురాలకు గౌరవించుకుంటూ, వారికి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాలయ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# క్విజ్ ఫ్యాకల్టీకి ఐఐటీ పీజీ సర్టిఫికెట్ల ప్రదానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

క్విజ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ వై శేషారావు (ప్రొఫెసర్ అండ్ డీన్) కు, ఐఐటీ భువనేశ్వర్ నుండి నిర్వహించబడిన రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలైజేషన్లో, అలాగే డాక్టర్ కె చంద్రశేఖర్‌కి (అసోసియేట్ ప్రొఫెసర్) ఐఐటీ పాట్నా నుండి నిర్వహించబడిన బ్లాక్‌చైన్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లో ఏఐసిటిఈ, క్యూఐపి పీజీ సర్టిఫికెట్లు ప్రదానం చేయబడినవి. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తరపున డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్‌పర్సన్ గాయత్రీ దేవి అధ్యాపకులను ఘనంగా అభినందించి, వారి అకాడమిక్ సాధనలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై వి హనుమంతరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సమీర్ కుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# 5న జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

## అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పిజిఆర్ఎస్‌కు హాజరు కావాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోదకుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 3)

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీల పై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా డాక్టర్ వి వినోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని, జిల్లా కలెక్టరేట్‌తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్ లో మండల తహశీల్దార్లు కార్యాలయాలలోను తహశీల్దార్లు, ఎంపీడిఓలు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని, మీకోసం వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని, పిజిఆర్ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఎస్సీ పాలెంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

### మహిళా విద్య, సామాజిక సమానత్వానికి ఆమె చేసిన సేవలు స్ఫూర్తిదాయకం

### లింగంగుంట్ల మరియదాసు



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జనవరి 3)**

అణచివేతకు గురైన వర్గాల విద్య, మహిళా సాధికారత కోసం తన జీవితాన్నే అంకితం చేసిన భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే అని పుల్లలచెరువు గ్రామ పంచాయతీ తొమ్మిదవ వార్డు సభ్యుడు లింగంగుంట్ల మరియదాసు అన్నారు. పుల్లలచెరువు గ్రామ పంచాయతీలోని ఎస్సీ పాలెంలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మహిళల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగంగుంట్ల మరియదాసుతో పాటు గ్రామస్తులు పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా మాత్రమే కాకుండా, గొప్ప సామాజిక సంస్కర్త, కవయిత్రిగా కూడా విశేష గుర్తింపు పొందారని తెలిపారు. ఆమె తన భర్త మహాత్మా జ్యోతీరావ్ పూలేతో కలిసి 19వ శతాబ్దంలో మహిళల విద్య, దళితులు మరియు అణగారిన వర్గాల విద్య కోసం నిరంతర పోరాటం చేశారని గుర్తు చేశారు.స్త్రీలు చదవడం నేరంగా భావించిన కాలంలోనే బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించి సమాజంలో విప్లవాత్మక మార్పుకు నాంది పలికిన మహానీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కుల, మత, లింగ భేదాలు లేని సమాన సమాజ నిర్మాణమే ఆమె జీవిత లక్ష్యమని తెలిపారు. సావిత్రిబాయి పూలే చేసిన ముఖ్య కార్యక్రమాల గురించి చెప్పుకుంటే 1848లో పూణేలో తొలి బాలికల పాఠశాల స్థాపన, అణగారిన వర్గాల పిల్లలకు విద్య అందించేందుకు ప్రత్యేక పాఠశాలలు ప్రారంభం. విధవ మహిళల కోసం ఆశ్రమాల ఏర్పాటు, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమం, మహిళా హక్కులు, సామాజిక సమానత్వంపై రచనలు, కవితల ద్వారా అవగాహన, కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటం... ఇలా చెప్పుకుంటే ఆమె జీవితమంతా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆమెకు లభించిన గౌరవాల గురించి చెప్పుకుంటే భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రలో స్థానం, మహిళా విద్యా పితామహిగా జాతీయ గుర్తింపు, అనేక రాష్ట్రాల్లో ఆమె పేరిట విద్యాసంస్థలు, పథకాలు, భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహణ,ఆమె చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని, ముఖ్యంగా విద్యార్థులు ఆమె జీవితం నుంచి స్ఫూర్తి పొందుతూ విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని గ్రహించాలని లింగంగుంట్ల మరియదాసు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ పాలెంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సావిత్రిబాయి పూలే ఆశయాలను స్మరించుకుంటూ ఆమె సేవలను కొనియాడారు.



# రైతుల సంక్షేమం, ప్రజారోగ్యమే ఎన్డీఏ ప్రభుత్వం లక్ష్యం

### బీజేపీ నేత డాక్టర్ ఏలూరి

**(షణ్ముఖ వెలుగు, విజయవాడ, జనవరి 3)**

రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం ఎనలేని క ృషి చేస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం విజయవాడలో జరిగిన బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సహజ మరియు సేంద్రీయ వ్యవసాయంపై చర్చా కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందరరేగా డాక్టర్ ఏలూరి మాట్లాడుతూ నానాటికీ వ్యవసాయ రంగంలో కృత్రిమ ఎరువులు, రసాయనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భూమిలో సారం తగ్గిపోతోందని, దీనివలన ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సేంద్రీయ (ఆర్గానిక్) వ్యవసాయం కాలానికి అనుగుణమైన అవసరమని, ఇది రైతులకు మంచి ఆదాయం, వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తుందని అన్నారు. రైతులు ప్రక ృతి హితమైన పద్ధతులు అవలంబించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక విధానాలు అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక సహాయం, ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పంట నష్టాలకు భరోసా, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ వంటి పథకాలతో సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం వంటి నిర్ణయాలతో రైతులకు బాసటగా నిలుస్తుందని అన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం భూమి సారాన్ని కాపాడడమే కాకుండా నీటి వినియోగాన్ని తగ్గించి పర్యావరణ సమతుల్యతను నిలుపుతుందని చెప్పారు. రైతులు తక్కువ ఖర్చుతో దీర్ఘకాలిక లాభాలు పొందేందుకు సేంద్రియ సాగు దోహదపడుతుందని, భవిష్యత్ తరాల ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ దీనికి మద్దతు ఇవ్వాలని డాక్టర్ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు.

# సావిత్రీబాయి పూలే జయంతి




**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జనవరి 3)**

అణగారిన కులాల ఐక్యవేదిక (జేఏసీ) ఆధ్వర్యంలోసావిత్రీబాయి పూలే 195 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చీమకుర్తి పట్టణంలో జేఏసీ అధ్యక్షులు బండ్ల కొండలరావు అధ్యక్షతన జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రాంగణం నందు భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయులు,సామాజిక సంస్కర్త శ్రీమతి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలతో జేఏసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహాత్మ జ్యోతీరావ్ పూలే గారి భార్య ఆధునిక మహిళ విద్య కోసం,కుల నిర్మూలన కోసం,సామాజిక సమానత్వం కోసం తన భర్తతో కలసి 1848 సంవత్సరంలో పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను స్థాపించిన గొప్ప మహిళ ఉద్యమకారుణి అని కొనియాడారు. ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పోరాడిన చైతన్య మూర్తి మార్గ దర్శకరాలు,స్ఫూర్తి ప్రధాత అని తెలిపారు. ఈ సందర్భంగా మహిళ ఉపాధ్యాయులను నాయకులు సాలువ, పూలమాలతో సత్కరించి మహిళ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ సలహాదారులు బండ్ల డేవిడ్, మాజీ చీమకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ కౌత్రపు రాఘవరావు, జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు పేరం శ్రీనివాసరావు, షేక్ ఖాదర్ భాష, మున్సిపాలిటీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, జేఏసీ నాయకులు మర్రి లక్ష్మీనారాయణ, బత్తుల మల్లికార్జున, కోట రాములు, పాలపర్తి శ్రీకాంత్, అత్యల డేవిడ్, ఇస్తర్ల శంకర్ బహుజన్, దొంతు సోమయ్య, రిటైర్డ్ ఆర్టీసీ బ్రహ్మం, ప్రధానోపాధ్యాయులు జి వీరస్వామి, సీనియర్ ఉపాధ్యాయులు దాసరి సుబ్బారావు, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





# పాస్ బుక్ మన హక్కు

# చేజర్లలో రాజముద్రతో కొత్త పాస్ బుక్‌లు

### అందించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)**

పాస్ బుక్ మన హక్కు. కొంతమందికి వారసత్వంగా వచ్చింది. మరికొంతమంది కష్టార్జితంతో సంపాదించుకున్నారు. దీనిపై ఇతరులకు ఎవరికి హక్కు ఉండకూడదు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం రాజ ముద్రతో కొత్త పుస్తకాలు అందిస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. ఒంగోలు మండలం చేజర్ల గ్రామంలోని రైతులకు రాజ ముద్రతో ముద్రించిన కొత్త పాస్ బుక్ లను ఎమ్మెల్యే అందించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి తలకాయతో పాస్ బుక్ లు ఇచ్చిందని, ఆ పాస్ బుక్ లను రైతులు ఆందోళన చెందారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూములను సర్వే చేసి రాజ ముద్రతో రైతులకు హక్కులు కల్పిస్తూ ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఒంగోలు రూరల్ తహసీల్దార్ నాయబ్ రసూల్, టీడీపి మండల అధ్యక్షుడు గుండపనేని శ్రీనివాసులు, నాయకులు పోలవరపు సీతారామయ్య, గంగాధర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# మార్నేని రత్తమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్



**(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జనవరి 3)**

సంతనూతలపాడు నియోజకవర్గం మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలో శనివారం మార్నేని రత్తమ్మ పెద్ద కర్మ కార్యక్రమంలో పాల్గొన్న సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడక స్వాములు, మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు ,పోతినేని శ్రీనివాసరావు, మల్లవరం టెంపుల్ చైర్మన్ మార్నేని రాఘవ, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ సర్వసభ సమావేశంలో హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జనవరి 3)**

జిల్లా పరిషత్ సర్వసభ సమావేశంలో హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పలు సమస్యల గురించి జిల్లా పరిషత్ సమావేశంలో విద్యుత్, విద్యాశాఖ, ఆరోగ్య, మంచినీటి సమస్యల గురించి జిల్లా పరిషత్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లగా అధికారులు వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలియజేశారు.

## ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో సావిత్రిబాయి పూలే జయంతి







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 3)

మండల కేంద్రమైన ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్, మహాత్మా సావిత్రిబాయి పూలే జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఉలవపాడు ఎస్ఐ గారపాటి సుబ్బారావు పాల్గొని భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలె దేశానికీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గారపాటి గోపీ చంద్ ప్రకాష్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. మహిళా అధ్యాపకులు జ్యోతి, గంగాభవాని, సుభాషిణి లను ఎస్ఐ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

## గుర్తించిన బ్లాక్ స్పాట్‌లను సరిచెయ్యడం ద్వారా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చు





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 3)

గుర్తించిన బ్లాక్ స్పాట్ లను సరిచెయ్యడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించ వచ్చని జిల్లా రవాణా శాఖ అధికారి టి కె పరంధామ రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయం నందు రోడ్డు ఇంజినీరింగ్ అధికారులు, పోలీస్ శాఖలతో పరంధామరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో 50 శాతం గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద జరుగుతున్నాయని బ్లాక్ స్పాట్లను సరిచెయ్యడంలో ఇంజనీరింగ్ శాఖలు సహకరించాలని కోరారు. బ్లాక్ స్పాట్ల ను సరిచెయ్యడంతో పాటు వాహనాల వేగాన్ని నియంత్రించడానికి తీసికొనవలసిన చర్యలపై చర్చించారు. సమావేశం అనంతరం రవాణా శాఖ అధికారులు, రోడ్డు ఇంజనీరింగ్ అధికారులు, పోలీస్ అధికారులు కలిసి బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు డిబివి రంగారావు, ఎన్ ప్రసన్న కుమారి, ఆర్ అండ్ బి జిల్లా ఇంజనీరింగ్ ఆఫీసర్ ఎం నళిని, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి వసంత కుమార్, వెదుళ్లపల్లి ఎస్ఐ పి భాగ్య రాజు, డిటిఆర్‌బి ఎఎస్ఐ కె వివేక్ కుమార్, ఎన్.హెచ్ 216 రెసిడెంట్ ఇంజనీర్ సౌరభ్ సింగ్, ఎన్ హెచ్ 16 రూట్ మేనేజర్ రాకేష్ గౌడ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

# చీమకుర్తి హరిహర క్షేత్రంలో ఘనంగా శ్రీ గోదా దేవి అమ్మవారి సారె సమర్పణ

విశేష అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చిన గోదా దేవి,
పద్మావతి సమేత శ్రీ రంగనాథ స్వామి
గోదాదేవి, పద్మావతి అమ్మవారికి సారె, వడి బియ్యం సమర్పించిన
మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జనవరి 3)

ధనుర్మాసం తిరు నక్షత్రం సందర్భంగా శనివారం చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో జరిగిన శ్రీ గోదా దేవి అమ్మవారికి సారె సమర్పణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి నేతృత్వంలో జరిగిన అమ్మవారికి సారె, వడి బియ్యం సమర్పణ పండుగలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా పాండురంగారావు దంపతులు క్షేత్రంలో వేంచేసివున్న సర్వ దేవతలకు విశేష పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. శిద్దా లక్ష్మీ పద్మావతి, సువాసినిలతో కలసి గోదాదేవికి పట్టు చీర, రవికె, గాజులు, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, విశేష రకాల, పండ్లు, అమ్మవారి ప్రీతి కరమైన పిండి వంటలతో అమ్మవారికి మహా నైవేద్యం సమర్పించారు. అమ్మవారి కీర్తనలను, భజనలు చీమకుర్తి హరిహర క్షేత్రం వైకుంఠం తలపించింది. ధనుర్మాసం సందర్భంగా క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ గోదా దేవి సమేత శ్రీ రంగ నాధ స్వామి వారికి ప్రాతకాలంలో స్వామివారికి, అమ్మవారికి తిరుప్పళ్లాండు, తిరుప్పాల్లెలుచి, తిరుప్పావై పారాయణం ప్రధమ ఆరాధన, పూజ, అర్చన పూలతో అలంకారం నైవేద్యం, హారతి సాత్తుమోరై 19వ పాశురం సమర్పణ నిర్వహించారు.

### కన్నుల పండువగా అమ్మవారి నగరోత్సవం



ధనుర్మాసం తిరు నక్షత్రం సందర్భంగా లక్ష్మీ పద్మావతి ఆధ్వర్యంలో శ్రీ గోదాదేవి అమ్మవారి నగరోత్సవం అత్యంత కమనీయంగా, శోభాయమానంగా జరిగింది. చీమకుర్తి రహదారి నుండి హరి హర క్షేత్రం వరకు సాగిన నగర ఉత్సవంలో మహిళలు అమ్మవారి సారె, వడి బియ్యంతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు భజనలు కీర్తనలతో ఆద్యంతం భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి మహిళలు అమ్మవారికి సారె, వడి బియ్యం, సమర్పించారు. ఈ వేడుకలలో శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా పెద్ద బాబు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సాయిబాబు దంపతులు, శిద్దా వెంకట ప్రసాద్ దంపతులు శిద్దా సురేష్ దంపతులు, శిద్దా బాలాజీ దంపతులు, శిద్దా పుష్పాలత,శిద్దా జయభారతి, కొలిపర్తి వెంకట సుందరం, వడ్డీ కాసులు, ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు సువర్ణ, పల్లపోతు పద్మ, అరుణ, ఆర్యవైశ్య వాసవి మహిళా సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిద్దా వెంకటేశ్వర్లు, శ్రీమతి వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాలు, ఉచిత బస్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు వెంకట హరి కుమారాచార్యులు, సుబ్రహ్మణ్యం శర్మ, హరికృష్ణ శర్మ, భక్తులకు తీర్థప్రసాదాలు అందచేసారు.






# జిల్లా పోలీస్ కార్యాలయంలో పలు విభాగాల ఏర్పాటుకు ప్రదేశాలను పరిశీలించిన జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 3)

నూతనంగా ఏర్పాటైన మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయాన్ని శనివారం జిల్లా ఇంచార్జ్ ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణాన్ని, వివిధ విభాగాల నిర్వహణకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఎస్పీ పరిశీలించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డిసిఆర్బీ, స్పెషల్ బ్రాంచ్, ఐటి కోర్, డిపిఓ తదితర కీలక విభాగాలను ఏర్పాటు చేయుటకు అనువైన పలు ప్రదేశాలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అదే విధంగా పోలీస్ కార్యాలయానికి అనుబంధంగా ఉన్న క్వార్టర్స్ చుట్టూ ఉన్న ప్రాంతాలను పరిశీలించి, అక్కడ మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, పరిశుభ్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బందికి అవసరమైన వసతులను మెరుగుపరచాలని, కార్యాలయాల్లో సమర్థవంతమైన నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట మార్కాపురం డిఎస్పి యు నాగరాజు, ఎఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ యం శ్రీనివాసరావు, మార్కాపురం సిఐ యం సుబ్బారావు, మార్కాపురం టౌన్ ఎస్ఐలు సైదులు బాబు, మార్కాపురం రూరల్ ఎస్ఐ అంకమ్మరావు, పెద్దారవీడు ఎస్ఐ సాంబశివయ్య, సిబ్బంది ఉన్నారు.





# పర్యావరణ రక్షించడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత




### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

పర్యావరణ రక్షించడం అనేది ఏ ఒక్క వ్యక్తి వల్లనో ఒక సంస్థ వలన జరిగేది కాదని సమాజంలో ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా పర్యావరణ పరిరక్షించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. శనివారం వల్లూరులో గల రైజ్ ఇంజనీరింగ్ కళాశాల నందు నిర్వహించిన ప్రొటెక్ట్ టుడే-సెక్యూర్ టుమారో అనే అంశం మీద నిర్వహించిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని భవిష్యత్తు తరాలకు తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులతో పాటు పరిశుభ్రమైన పర్యావరణ అందించాలని అన్నారు. విపరీతమైన కాలుష్యం వలన భారత దేశ రాజధాని అయిన ఢిల్లీ పౌరులు ఎంత ఇబ్బందులు పడుతున్నారో దేశం మొత్తం గమనిస్తుందని ఈ పరిస్థితి రాకుండా ప్రతి ఒక్కరు పర్యావరణం పట్ల అవగాహన కలిగి ఉండాలని అదే విధంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఈరోజు దేశంలో దాదాపు 9 మిలియన్ ప్రజలు వివిధ రూపాల్లో మత్తుపదార్థాలకు బానిసై ఉన్నారని చిన్న స్థాయిలో మొదలైన ఈ వ్యసనం డ్రగ్స్ వాడకం దిశగా తీసుకెళ్తుందని ఈ విషయం పట్ల విద్యార్థినీ విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు మరియు కళాశాల ఆచార్యులు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల యొక్క మానసిక స్థితిని గమనిస్తూ ఉండాలని అన్నారు తదనంతరం న్యాయమూర్తి 18 సంవత్సరాలలోపు వయసు గల బాలబాలికల పట్ల జరిగే లైంగిక చర్యలు యొక్క దుష్ప్రభావాలను పోక్సో యాక్ట్ రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో రైస్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఏ వి భాస్కరరావు పొల్యూషన్ బోర్డ్ ఇంజనీర్లు భాస్కర్ వర్మ, సునీల్ కుమార్ పాల్గొన్నారు.



# పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 3)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన మీ భూమి మీ హక్కు పట్టాదార్ పాస్ పుస్తకాలను సంబంధిత లబ్ధిదారులకు అధికారులు, టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. మండలంలోని గ్రామంలో శనివారం రీసర్వే జరిపిన భూములకు రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్‌పుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల తహసిల్దార్ కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ స్వర్ణగీత, ఏఎంసీ చైర్మన్ డాక్టర్ ఇమాంసా, మాదిరెడ్డిపాలెం సొసైటీ ప్రెసిడెంట్ యర్రంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, పొదిలి మండల పార్టీ అధ్యక్షుడు దోర్నాల అంజిరెడ్డి, నాయకులు సోమయ్య, పొదిలి పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాసిం, పాశం నరసింహారావు, ముని శీను, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 3)

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే 196 వ జయంతి, మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం కనిగిరిలోని ఏబి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మొదటి మహిళ ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని, సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో చదువు నేర్చుకుని తనలాగా చదువుకు దూరమైన ఎంతోమంది మహిళలకు చదువు నేర్పి భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా పేరు పొందారని కొనియాడారు. మహిళలను ఆమె ఎంతగానో ప్రోత్సహించారన్నారు. సావిత్రిబాయి పూలే మహిళలకు చేసిన సేవలను పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.కె నాయబ్ రసూల్, ఈర్ల విజయరామరాజు, కోశాధికారి పట్నం నరసింహం, సీనియర్ నాయకులు గౌరవ అధ్యక్షులు దేవరాజు గట్టు శివ కాశయ్య, బొప్పరాజు వెంకట సుబ్బారావు, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు చెరుకూరి చిన్న కాశయ్య, తొగటవీర క్షత్రియ రాష్ట్ర నాయకులు సిగ కృష్ణారావు,బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు ద్రోణాదుల చెంచులు, కండ్లకుంట గురు ప్రసాద్, వడ్డెర నాయకులు బత్తుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# సంతనూతలపాడు నియోజకవర్గంలో విస్తృతంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)



పేదలు వైద్య ఖర్చులకోసం ఇబ్బంది పడకూడదని, సంతనూతలపాడు నియోజకవర్గంలో విస్తృతంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నామని సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఉదయం 27 మంది లబ్ధిదారులకు 14 లక్షల 27 వేల 132 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల్లో 9 కోట్ల రూపాయల వరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు అందజేయడం జరిగిందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకన్న కూడా పేదలకు సీఎంఆర్ఎఫ్ సహాయనిధి ద్వారా వారి కుటుంబాలకు అండగా నిలవడం తనకు సంతృప్తిని ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, సీనియర్ నాయకులు ఎడ్లపల్లి రాంబ్రహ్మం, మద్దిపాడు మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), నాగులుప్పలపాడు మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్, కిషోర్, సంతనూతలపాడు మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.





# మాచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ జి కవితకు ఘన సత్కారం

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జనవరి 3)

స్త్రీవిద్య కోసం సాధికారత కోసం మరియు సామాజిక న్యాయం కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి నేటికీ స్ఫూర్తిదాయకమని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం, పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ నెంబర్ కుక్కమూడి ప్రసాద్ అన్నారు. శనివారం పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం మాచర్ల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సంఘసంస్కర్త రచయిత్రి, సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిస్తూ మహిళ ఉపాధ్యాయులందరికీ జాతీయ మహిళ ఉపాధ్యాయురాల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తల్లిదండ్రులకు టీచర్స్ కి చదువుతున్న స్కూలుకు మంచి పేరు తీసుకురావాలని, ఉపాధ్యాయులకు విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జి కవిత అధ్యక్షత వహించి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అందించిన సేవలు ఆమె త్యాగం మరువలేనివని ప్రతి మహిళ ఆమెను స్ఫూర్తిగా తీసుకొని సమసమాజ స్థాపనకు కృషి చేయాలి అన్నారు. సిపిఐ గురజాల డివిజన్ కార్యదర్శి మాచవరపు నాగేశ్వరావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే దంపతులు కులవ్యక్షత, అంటరానితనం, బ్రాహ్మణిజం పై పోరాటం చేసి మహిళల విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన మహెూన్నత వ్యక్తులు అని అన్నారు. ఎన్ కె ప్రసన్న కుమారి, సిహెచ్ లీలా కుమారి, ఎం ఈదమ్మ ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే గురించి వివరించారు. అనంతరం జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మాచర్ల కేజీబీవీ ప్రిన్సిపల్ జి.కవితను శాలవాలు పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జమ్మలమడక మాజీ ఎంపీటీసీ పరిమళ రాజారావు, కేజీబీవీ మహిళ ఉపాధ్యాయురాల్లు, సిబ్బంది, విద్యార్థినులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





# జనవిజ్ఞాన వేదిక క్యాలెండర్ అవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జనవరి 3)

మండలంలోని చిన్నగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శనివారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. శ్రీనివాసరెడ్డి, జన విజ్ఞాన వేదిక మాజీ ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు కలసి జనవిజ్ఞాన వేదిక క్యాలెండర్ ను సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలు, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేలా జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నగంజాం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ నరసింహారావు, సీహెచ్ సుబ్బారావు, యుటిఎఫ్ నాయకులు పాపారావు, ప్రసాద్, పాఠశాల సిబ్బంది కుమార్, గంట అంకమ్మ, కోటిరెడ్డి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లాలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మర్కాపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జనవరి 3)

మార్కాపురం జిల్లా కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇన్‌ఛార్జి జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కాపురం జిల్లా పరిధిలోని మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజక వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఆ ప్రకటనలో తెలిపారు.

## 5న విబి-జి రామ్-జీ పై గ్రామసభ



(షణ్ముఖ వెలుగు, చినగంజాం, జనవరి 3)
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో వస్తున్న విబి-జి రామ్ జీపై విస్తృత అవగాహన కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో జనవరి 5న గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల ఎంపిడిఓ కె.ధనలక్ష్మి తెలిపారు. ఇ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ వికసిత్ భారత్ - 2047 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ఉపాధి ,మౌలిక వసతులు, జీవనోపాధిని బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశంగా ఇ పథకం సేవలు అందిస్తుందన్నారు.ఇందులో గ్రామీణ కూలీలకు 125 రోజులు పని కల్పించుట, గ్రామాలలో సుస్థిర ఆస్తులు పెంచుట, గ్రామాలలో నీటి సంరక్షణ పనులు చేపట్టుట మరియు కాలానుగుణంగా కొన్ని మార్పులను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు.ఈనెల 5వ మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రత్యేక గ్రామసభల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ఉపాధి కూలీలు పాల్గొనాలని కోరారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 3)
మండల పరిధిలోని భీమవరం జడ్పీ హైస్కూల్లో శనివారం ప్రధానోపాధ్యాయులు బండి సుబ్బారావు ఆధ్వర్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మొదట ఉపాధ్యాయులు విద్యార్థులు క్రాంతి జ్యోతి సంఘసంస్కర్త భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళల విద్యాభివృద్ధికి మరియు సమాజంలోని మూఢవిశ్వాసాలను రూపుమాపడానికి సావిత్రిబాయి, జ్యోతిరావు పూలే నిర్వహించిన పాత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మేడికొండ భాస్కర్ మాట్లాడుతూ భారత సమాజంలో నేడు మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడుస్తున్నారంటే, బడుగు బలహీనవర్గాల ప్రజలు విద్యా అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారంటే అది ఆనాడు సావిత్రిబాయి, మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు చేసిన కృషివల్లే అన్నారు. కావున భారత సమాజం ఎప్పటికీ పూలే దంపతులకు రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు జి హేమలతను విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. బాల, బాలికలకు మిఠాయిలు పంచడంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరావు, దార్లంకయ్య, శ్రీధర్, మస్తాన్ వలి, చిట్టిబాబు, హేమలత, సుబ్బారావు, సిబ్బంది బుజ్జయ్య పాల్గొనగా కార్యక్రమాన్ని మేడి కొండ భాస్కర్ పర్యవేక్షించారు.

# రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పండుగ ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

### నీలగంగవరంలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం
### హాజరైన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, కలెక్టర్ కృతిక శుక్ల







(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 3)
రాష్ట్రంలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ రైతులకు పండుగల మారిందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం నీలగంగవరం గ్రామంలో శనివారం "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమంలో చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా, జిడిసిసిబి చైర్మన్ మక్కిన మల్లికార్జునరావు, నరసరావుపేట ఆర్డీవో మధులత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకాలు, హద్దు రాళ్లపై తన బొమ్మలు వేసుకున్న చరిత్ర జగన్ మోహన్ రెడ్డిదని, అయితే రాజముద్ర వేసి పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని అన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం చేతకాని జగన్ ప్రభుత్వంలో తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దుచేసి ల్యాండ్ గ్రాఫి యాక్ట్ తెచ్చామని జీవి వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ నిషేధిత భూముల జాబితా (22ఏ) లో నుండి ఐదు కేటగిరీల భూములను జాబితాల నుంచి తొలగించి రైతులకు కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందన్నారు. వారసత్వ ఆస్తులు 100 రూపాయలకే రిజిస్ట్రేషన్ చేయించి రైతులను ఆదుకోవడమే చంద్రబాబు నాయుడు పరదర్శక పాలనకు నిదర్శనం అన్నారు. అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసి భూ వివాదాలకు తావు లేకుండా కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా అండగా ఉంటుందని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు. ఐదు కేటగిరీల తొలగింపుతో రాష్ట్రంలో లక్షలాది మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. దీనివలన పల్నాడు జిల్లాలో 90 వేల మంది రైతులకు పైగా మేలు జరగా, వినుకొండ నియోజకవర్గంలో 39600 మందికి పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వినుకొండ మండలంలో 6775 రాజముద్రలతో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ఉన్న రెవిన్యూ సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నామని అన్నారు. 1906 తరువాత రాష్ట్ర ప్రభుత్వం తిరిగి రెవెన్యూ సర్వే నిర్వహిస్తుందని, సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో రెవెన్యూ క్లినిక్లు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియ జరుగుతుంది అన్నారు. ఈ సందర్భంగా రైతులకు రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆధరాభిమానాలను చూరగున్న వార్త దినపత్రిక

### వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జనవరి 3)
తెలుగు రాష్ట్రాలలో ప్రజల ఆధరాభిమానాలను చూరగున్న వార్త జాతీయ దినపత్రిక అని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ రాచపూడి సాయికృష్ణ అన్నారు. శనివారం 2026 వార్త జాతీయ దినపత్రిక నూతన క్యాలెండర్ ను వార్త స్టాప్ రిపోర్టర్ భూమిరెడ్డి వెంకటేష్ అర్బన్ రిపోర్టర్ వల్ల వెంకటరమణ గోపవరం విలేకరి కటారు రామయ్యల ఆధ్వర్యంలో క్యాలెండర్ను మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, సాయి క్రిష్ణ పలువురు నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటుగా నిజాలను నిక్కచ్చిగా ప్రజలకు సమాచార రూపంలో అందించిన దినపత్రిక వార్త అన్నారు.

**పలువురికి వార్త క్యాలెండర్స్ అందజేత**

2026 సంవత్సరం వార్త జాతీయ దినపత్రిక నూతన క్యాలెండర్స్ ను వార్త స్టాప్ రిపోర్టర్ భూమిరెడ్డి వెంకటేష్, అర్బన్ రిపోర్టర్ వల్లంకొండు వెంకటరమణలు రెడ్డి చికెన్ సెంటర్ యజమాని గాజులపల్లె వెంకటరమణారెడ్డి, ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి, కత్తి బ్రహ్మయ్య, గంగన్న తోపాటు పలువురు పెన్షనర్స్ కు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పుత్తా శ్రీరాములు,మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్,హాజరత్, మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ చిన్ని సుబ్బారావు, మార్కెట్ యార్ డైరెక్టర్ అన్నం రెడ్డి చంద్ర కళావతి రమణారెడ్డి, రెడ్డి ట్రాన్స్పోర్ట్ గాజులపల్లి నరసింహారెడ్డి, మాజీ యాదవ సంఘం అధ్యక్షులు రామనబోయిన శ్రీనివాసులు యాదవ్ జనసేన సీనియర్ నాయకులు దగ్ధం నాగార్జున ఆర్యవైశ్య వర్తక సంఘం ఉపాధ్యక్షులు దర్శి సుబ్బరాజా,యాదాల్ల కృష్ణమూర్తి, జొన్నలగడ్డ సుధాకర్ (వస్త్రం) చెన్న కృష్ణారెడ్డి,రాచపూడి వెంకటరత్నం, కాంట్రాక్టర్ శివారెడ్డి పవన్, చెవుల వెంకటేశ్వర్లు,తులసి వెంకట శివ నారాయణ,ఉంటా నరసింహులు, సింగరయ్య సాయిరామ్ డైరీ పాపిశెట్టి వీరాంజనేయులు, ఆడిటర్ గండికోట శివకుమార్, సిరిగిరి నారాయణ లక్ష్మీనారాయణ, శ్రీనివాస ట్రేడర్స్ పత్తి వెంకటసుబ్బయ్య, గుప్తా ఫౌండేషన్ కొలపర్తి హేమంత్ గుప్తా, బాశికాల నారాయణ, పోనిపర్తి అనిల్ కుమార్ రాజు ఇమ్మడిశెట్టి సత్యనారాయణ, మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు బచ్చు సుబ్రహ్మణ్యం, శ్రీ సాయి వెంకటేశ్వర ట్రేడర్స్ పార్ట్నర్స్ పత్తి రాజా గారి కృష్ణమూర్తి, పబ్బతి చంద్రశేఖర్, సత్యం, హాజరత్, మెంటా ప్రసాద్ చిందుకూరి సుధాకర్, సురేష్, తో పాటు పలువురు నాయకులకు అధికారులకు పుర ప్రజలకు వార్తా జాతీయ దినపత్రిక నూతన క్యాలెండర్ను అందజేయడం జరిగింది.



**వార్త క్యాలెండర్ ను ఆవిష్కరించిన సిఐలు....**

2026 సంవత్సరం వార్త జాతీయ దినపత్రిక నూతన క్యాలెండర్ను శనివారం అర్బన్ సీఐ లింగప్ప, రూరల్ సీఐ కృష్ణయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు, అనంతరం వార్త జాతీయ దినపత్రిక ద్వారా ముందస్తుగా బద్వేల్ పట్టణ ప్రజలకు అధికారులకు నాయకులకు సంక్రాంతి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మానుగుంట రవిశంకర్ కొలిశెట్టి సుబ్రహ్మణ్యం మరియు వార్త ప్రతినిధులు పాల్గొన్నారు.

# విక్కిరాలపేటలో పండుగ వాతావరణం

## పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

## అప్పుడు సైకో ఫోటోలు - ఇప్పుడు రాజముద్ర

## రైతులంటే చంద్రబాబుకు ఎంతో ప్రేమ

## కూటమి ప్రభుత్వం వచ్చాకే పల్లెల్లో అభివృద్ధి పనులు

## పాస్ పుస్తకాల్లో తప్పులన్నీ అధికారులు వారంలో సరిచేయాలి

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశం





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జనవరి 3)

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం కందుకూరు మండలం విక్కిరాలపేటలో శనివారం పండుగ వాతావరణంలో జరిగింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై 495 మంది రైతులకు సరికొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను స్వయంగా పంపిణీ చేశారు. గతంలో జగన్ ఫోటో ఉన్న పాసుపుస్తకాల స్థానంలో ప్రభుత్వ ముద్రతో కూడిన పుస్తకాలు అందించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి రైతులంటే వల్లమాలిన ప్రేమ అని, ఏడాదికి 20వేల రూపాయలు చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో సైకో ముఖ్యమంత్రి పాస్ పుస్తకాల మీద, హద్దురాళ్లపైన తన ఫోటో వేసుకొని వికృతానందం పొందారని విమర్శించారు. రీసర్వే పేరుతో రైతులను ఇబ్బందులు పాలు చేశారని, అవన్నీ రైతులు గుర్తుపెట్టుకుని గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు పాత పాసు పుస్తకాల స్థానంలో, రాజముద్రతో కూడిన పుస్తకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలియజేశారు. గ్రామంలో ప్రస్తుత అందజేస్తున్న 495 పాస్ పుస్తకాలలో ఇంకా కొన్ని తప్పులు కనిపిస్తున్నాయని, వాటిని వారంలోపు సరి చేయాల్సిందేనని అధికారులకు ఎమ్మెల్యే అల్టిమేటం జారీ చేశారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి భవన నిర్మాణం, చెక్ డాం పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో అనాలోచిత నిర్ణయాల వల్ల పల్లెల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఎమ్మెల్యే నాగేశ్వరావు అన్నారు. పంచాయతీలకు వచ్చిన నిధులు రాత్రికి రాత్రి మాయం చేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని అన్నారు. ముఖ్యంగా పంచాయతీల్లో పొలాలకు వెళ్లి రోడ్లు ఇబ్బందికరంగా ఉన్నాయని , రూరల్ నియోజకవర్గాల్లో అలాంటి చోట్ల బాగు చేసేందుకు నిధులు కేటాయించాలని అధికారులను కోరుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి తహసిల్దార్ హుస్సేన్ మండల అభివృద్ధి అధికారి రతన్ జ్యోతి డి ఎల్ పి ఓ కృష్ణమోహన్, మండల వ్యవసాయ అధికారి ఎస్కే అబ్దుల్ రహీం ఎస్ కే అబ్దుల్ రహీం, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయికిరణ్, మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, మన్నం శ్రీనివాసులు, గంగవరపు బ్రహ్మయ్య, గంగవరపు నారాయణ, మల్లెబోయిన కొండలరావు, గంగవరం బ్రహ్మయ్య, మన్నం శ్రీనివాసులు, మన్నం ప్రభాకర్ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎం కొండయ్య, సోంపల్లి శ్రీనివాస్ సిహెచ్ శ్రీకాంత్, అల్లం వెంకటేశ్వర్లు, బెజవాడ హరిబాబు, కామినేని నాగేశ్వరరావు, బైరపనేని రమణయ్య, రావుల రవి, ముప్పాళ్ళ శ్రీనివాసులు, ఏకాంబరం వెంకటరావు మరియు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# తనిఖీలు నిర్వహించిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు



## పొలంలో అక్రమ గంజాయి మొక్కలు స్వాధీనం

(షణ్ముఖ వెలుగు, కంభం, జనవరి 3)

కంభం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కి అందిన విశ్వసనీయ సమాచారము మేరకు వారి సిబ్బందితో కలిసి అర్ధవీడు మండలం మాగుటూరు గ్రామంలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో, మాగుటూరు గ్రామానికి చెందిన బి తిరుపాల్ తనకు చెందిన పొగాకు పంట పొలంలో అక్రమంగా ఏడు గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు గుర్తించారు. తదనంతరం గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో సదరు గంజాయి మొక్కలను అక్కడికక్కడే పెకిలించడం జరిగింది. అనంతరం నిందితుడిని అతని పంట పొలంలోనే అదుపులోకి తీసుకొని, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కంభం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందని కంభం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

# సేవలను గుర్తించడం సంతోషకరం

## లైం లైట్ అవార్డుకు ఎంపికైన చింతకుంట సుభాషిణి





(షణ్ముఖ వెలుగు, బద్వేలు, జనవరి 3)

ఆర్యవైశ్యులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే లైం లైట్ అవార్డుకు బద్వేల్ కు చెందిన చింతకుంట సుభాషిని ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం విజయవాడలో జాతీయస్థాయిలో నిర్వహించే ఆర్యవైశ్య లైన్ లైట్ అవార్డు 2025 కు సంబంధించి ఆమె ఎంపిక కావడం పట్ల బద్వేలు పట్టణ ఆర్యవైశ్య లు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో జరిగిన ఈ పోటీలకు సుభాషిని కి 11 వ స్థానం దక్కడం ఎంతో అభినందనీయమని స్థానిక ఆర్యవైశ్యుల తో పాటు బద్వేలు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు చింతగుంట సుభాషిని మాట్లాడుతూ తాను వనిత క్లబ్ ద్వారా ఆర్యవైశ్యులకు అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డును తనకు అందించడం ఎంతో ఆనందంగా ఉందని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్క వనితా క్లబ్ కుటుంబ సభ్యులకు తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే తాను సేవలలో పాల్గొని అవార్డు వచ్చేందుకు సహకరించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. రాబోయే రోజుల్లోనూ తాను మరిన్ని సేవలందించి తన వంతు మరిన్ని అవార్డులు అందుకునీ బద్వేలు ఆర్యవైశ్య కుటుంబానికి పేరు తెస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆమెఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ డూండి రాకేష్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఆర్యవైశ్య అధ్యక్షులు దేవతి భగవన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కంభం పట్టణంలో ముమ్మరంగా ట్రాఫిక్ తనిఖీలు

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఎస్ఐ శివ కృష్ణారెడ్డి





(షణ్ముఖ వెలుగు, కంభం, జనవరి 3)

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు శనివారం కంభం పట్టణంలో పోలీసులు ముమ్మరంగా ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ (తనిఖీలు) నిర్వహించారు. స్థానిక ఎస్ఐ శివ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తూనే, చిరు వ్యాపారులకు, దుకాణదారులకు రోడ్డు నిబంధనలు తెలియజేసారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కంభం పట్టణంలోని చౌక్ సెంటర్ లో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు చిన్నగా ఉన్నందున వ్యాపార దుకాణదారులు రోడ్డు లోపలికే ఉండాలని అలాకాకుండా వాహనదారులకు ఇబ్బంది కలిగేలా ముందుకు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలకు, పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా సహకరించాలి

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జనవరి 3)



కందుకూరు పట్టణం లో రోడ్డు డివైడింగ్ పనులు మొదలైన కారణంగా, పనులకు ఆటంకం కలగకుండా ఉండుటకు గాను రేపటి నుండి అనగా 4.01.26 నుండి కందుకూరు పట్టణం లోనికి పెద్ద వాహనాలను , పొట్టు లారీలు, పొట్టు ట్రాక్టర్లు, కట్టెల ట్రాక్టర్లు , టిప్పర్లు ) ఉదయం 8.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు నిషేధించడమైందని కందుకూరు ప్రజలకు పట్టణ పోలీసులు తెలిపారు.. అలాగే పామూరు బస్టాండ్ నుండి గుడ్లూరు రోడ్డు జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపుల వారు , పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి క్లబ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపుల వారు తమ షాపుల ముందు పార్కింగ్ చేయు వాహనాలను క్రమబద్ధంగా ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసుకోవలసిందిగా తెలపడం అయినది. తోపుడు బండ్ల వారు తోపుడు బండ్లను రోడ్డులో పెట్టకుండా సహకరించవలసిందిగా కోరడమైనది.కావున ప్రజలందరూ కందుకూరు పట్టణం నందు ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా సహకరించాలని కోరడమైనది.ఎవరైనా నిబంధనలు పాటించకుండా ట్రాఫిక్ కు అంతరాయం కలిగించినట్లు అయితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోబడును.

# ఛలో విశాఖ

## 18వ అఖిల మహాసభకు బయలుదేరిన కార్మికులు



(షణ్ముఖ వెలుగు, కంభం, జనవరి 3)

మార్కాపురం జిల్లా కంభం నుండి తమ డిమాండ్ల సాధనకు భవననిర్మాణ కార్మికులు శనివారం సాయంత్రం కంభం నుండి విశాఖ పట్నం బయలుదేరారు. విశాఖ పట్నంలో గత నాలుగు రోజుల నుండి సిఐటియు 18 వ అఖిల భారత మహాసభలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిఐటీయు మండల కన్వీనర్ షేక్ అన్వర్ బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందని తెలిపారు. ఈ కోడ్స్ అమల్లోకి రావడం వల్ల కార్మికులు తమ హక్కులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పనిగంటలు పెంచడం వల్ల కార్మికులు తమ కుటుంబ జీవితం కోల్పోతారని తెలిపారు. ఇది జీవించే హక్కును హరించడమేనని తెలిపారు. కాబట్టి వెంటనే రద్దు చేసిన కార్మిక చట్టాలను, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డులను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడాన్ని తప్పు బట్టారు. ప్రయివేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ డిమాండ్ల సాధనకు నాలుగో తేదీన విశాఖలో జరిగే భారీ ప్రదర్శనను జయప్రదం చేసేందుకు కార్మికులు బయలుదేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కంభం నుండి నాసర్ వలి, బి రోశయ్య, జి అబ్రహం, షేక్ మహబూబ్ భాష, కొత్తూరు, ప్రవీణ్ కుమార్, షేక్ రహమాన్ బయలుదేరారు. ఈ కార్యక్రమానికి షేక్ రహమాన్ నాయకత్వం వహించారు.

# ఏపీపీఎస్ శాఖపరమైన పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 3)

ఏపీపీఎస్ ద్వారా నిర్వహించే శాఖపరమైన పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ తెలిపారు. శనివారం, స్థానిక కలెక్టరేట్లోని జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్లో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ ఆధ్వర్యంలో పరీక్షల కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా శాఖా పరమైన పరీక్షలు - నవంబర్ 2025, నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షను వేటపాలెం మండలం, నాయన పల్లి గ్రామంలోని అయాన్ డిజిటల్ జోన్ సెంట్‌ఆన్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నందు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలు ఈనెల 5వ తేదీ నుండి 10వ తేదీ వరకు మొత్తం 12 విభాగాలుగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షలు ఆబ్జెక్టివ్, కన్వెన్షనల్ రెండు రకాలుగా నిర్వహిస్తారని, ఆబ్జెక్టివ్ రకం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు,కన్వెన్షనల్ రకం ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు జరుగుతాయని, ఆబ్జెక్టివ్ పరీక్షలకు 1474 మంది, కన్వెన్షనల్ పరీక్షకు 735 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఆరు రోజులు పాటు జరిగే శాఖపరమైన పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర గౌడ్ తెలిపారు. పరీక్ష జరిగే కేంద్రంలో పరిసరాలను

జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్



పరిశుభ్రంగా ఉంచాలని, మంచినీళ్లను అందుబాటులో ఉంచాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు తెలిపారు.పరీక్షలకు విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తుగా జనరేటర్లను ఏర్పాటు చేయాలని ఆయన విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఆరు రోజుల పాటు పరీక్ష కేంద్రంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని, మందులను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష జరిగే కేంద్ర ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేయాలని ఆయన పోలీస్ అధికారులకు సూచించారు. పరీక్ష నిర్వహించే కేంద్రంకు ఉదయం 8:30 నుండి 9:30 వరకు లోపలికి అనుమతిస్తారని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ తెలిపారు.

పరీక్ష కేంద్రం నకు సెల్ ఫోన్ అనుమతించబడదని, పుస్తకాల ఆధారంగా వ్రాసే పరీక్షకు పాఠ్యపుస్తకాలను, సర్వీస్ పుస్తకాలను మాత్రమే అనుమతిస్తారని, ఎటువంటి నకళ్లను, గైడ్స్, డైరీలను అనుమతించరని ఆయన అన్నారు. పరీక్ష జరిగే తేదీలలో ఎటువంటి అవాంతరమైన సంఘటన జరగకుండా, పరీక్షల నిర్వహణ చాలా సున్నితమైన అంశంగా భావించి అధికారులందరూ సమన్వయంతో పరీక్షలు నిర్వహణను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మల్లికార్జున్ రావు, పరీక్షల చీఫ్ సూపరెంటెంట్ భాను ప్రకాష్, వేటపాలెం, బాపట్ల తహసిల్దార్ గీతా రాణి, సలీమా, ఏపీపీఎస్సీ పరీక్ష నిర్వహణ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకం పంపిణి



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జనవరి 3)

మండలంలోని ఈ సర్వే జరిగిన ముప్పళ్ళపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన మీ భూమి మీ హక్కు పట్టాదార్ పాస్ పుస్తకముల పంపిణీ కార్యక్రమం జరిగింది. రీ సర్వే జరిగిన ముప్పళ్ళపాడు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ షేక్ నాగూర్ మీరా పాల్గొని రాజముద్రలతో కూడిన కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణ చైతన్య, విఆర్ఓ నాగార్జున, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు దిశనం వెంకటేశ్వర్‌రెడ్డి, కోటపాటి శేషయ్య, సర్పంచ్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ సభలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జనవరి 3)

మండల పరిధిలోని పడమటి నాయుడుపాలెంలో రీ-సర్వే పూర్తి అయిన గ్రామాలకు వచ్చియున్న క్యూఆర్ కోడ్ సహిత పట్టాదారు పాసు పుస్తకాలను శనివారం ఉదయం పడమటి నాయుడుపాలెం గ్రామ సచివాలయం నందు గ్రామ సభ నిర్వహించి చీమకుర్తి మండల తహశీల్దార్ ఆర్ బ్రహ్మయ్య రైతులకు పంపిణి చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో చీమకుర్తి మండల తహసిల్దార్ ఆర్ బ్రహ్మయ్య, ఆర్ఐ మౌనిక శ్రీలక్ష్మి, గ్రామ రెవిన్యూ అధికారి నారపరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఇస్తర్ల ఏడుకొండలు, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నక్క అనందబాబును మర్యాదపూర్వకంగా కలసిన రాఘవ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జనవరి 3)

బాపట్ల జిల్లా టీడీపీ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చిన్నగంజాం మండలం కడవకుదురు గ్రామనికి చెందిన నక్కల వీరరాఘవులు శనివారం వేమూరు ఎమ్మెల్యే నక్క ఆనంద్‌బాబుని మర్యాదపూర్వకంగా కలసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే నక్క అనందబాబుకు పుష్పగుచ్చం అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కల వీరరాఘవులకు శాలువతో సన్మానించారు.

# ఉపాధ్యాయురాలికి సన్మానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

సావిత్రిబాయి పూలే జయంతి, భారతదేశపు మొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఒంగోలులోని దేవుడి చెరువు పార్కు నందుగల రవీంద్ర భారతి స్కూల్ నందు గత 20 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎంవి నాగలక్ష్మికి బిజెపి పార్టీ కార్యాలయం నందు ఘనంగా సన్మానం చేశారు. ఆమెకు ఎన్నో సత్కారాలు, సన్మానాలు జరిగినాయని స్కూల్ సిబ్బంది చెప్పారు. కార్యక్రమంలో బిజెపి మహిళలు పార్టీ నాయకులు టీచరుకి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం మా పార్టీ కార్యాలయం నందు జరిగినందుకు మాకు ఎంతో సంతోషకరంగా ఉందని బిజెపి మహిళలు నాయకులు చెప్పారు. అలాగే రవీంద్ర భారతి స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీ, సాత్విక్, నాగలక్ష్మి టీచర్ గురించి మాట్లాడుతూ మా స్కూల్ నందు పనిచేస్తున్న నాగలక్ష్మి టీచర్‌కి ఈ సన్మాన కార్యక్రమం జరగడం ఎంతో ఆనందకరంగా ఉందని కొనియాడారు. అలాగే ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇకపై ఎయిడెడ్ లెక్కలు నిక్కచ్చిగా ఉండాలి





(షణ్ముఖ వెలుగు, కంభం, జనవరి 3)

ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు లెక్కలను నిక్కచ్చిగా నిగ్గుతేల్చనున్నట్లు ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు చెప్పారు. శనివారం మండలంలోని పలు ఎయిడెడ్ పాఠశాలలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరును భౌతికంగా,ఆన్లైన్,రికార్డు నమోదులో వ్యత్యాసాలను గుర్తించి వాస్తవ నివేదికలను రూపొందించారు. హాజరు లెక్కల్లో తేడా ఉన్న పాఠశాలలు తక్షణమే సరిచేయాలని , లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. నివేదికలను ఉన్నతాధికారులకు చేరవేస్తున్నట్లు తెలిపారు.

## వీఆర్‌సీరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ మాగుంట



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామం స్థానిక నాయకులు వీఆర్‌సీ రెడ్డి సతీమణి, వీరేపల్లి పద్మ ఇటీవల స్వర్గస్తులయ్యారు. శనివారం వారి కుటుంబాన్ని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి వారి చిత్రపటానికి నివాళులర్పించారు.

## ఉలవపాడు ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపిన మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 3)

ఉలవపాడు మండల డీలర్స్ అసోసియేషన్ తరపున శనివారం రోజున ఉలవపాడు మండల ఎస్ఐ జి సుబ్బారావుని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ సుబ్బారావుని శాలువతో సన్మానించి పూల బొకే అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెలిచెర్ల ప్రభాకర్ రావు, సయ్యద్ షాజహాన్, కోసూరి శ్రీరాములు, మరిబోయిన శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com